
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 9 జూలై 2025

69 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

కృష్ణాజిల్లాలో 67, ఎన్టీఆర్ జిల్లాలో 2 సంఘాలకు నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ కమిటీలో ఒక చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులకు అవకాశం

మచిలీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 69 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చైర్‌పర్సన్లతో పాటు ఇద్దరు చొప్పున సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో కృష్ణాజిల్లాలో 67, ఎన్టీఆర్ జిల్లాలో రెండు పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఈ త్రిసభ్య కమిటీల పదవీ కాలం తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో 425 పీఏసీఎస్‌లు ఉండగా, తొలి విడతగా 69 పీఏసీఎస్‌లకు ఈ కమిటీలను ప్రకటించారు. 2018 మిగతా 6లో..





శాకంబరీ నమోస్తుతే

ఇంద్రకీలాద్రిపై వైభవంగా శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు కూరగాయలు, ఆకుకూరలతో ముస్తాబు

- 50 వేల మెట్రిక్ టన్నుల కూరగాయలతో ప్రత్యేక అలంకరణ, కదంబ ప్రసాదం
- హరిత వర్ణ శోభితంగా ప్రాంగణం.. దుర్గమ్మ దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు



ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో మూడు రోజుల పాటు జరుగనున్న ఉత్సవాల్లో మొదటి రోజు మూలవిరాట్ దుర్గమ్మను వివిధ రకాల పండ్లు, ఆకు కూరలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలను, దేవతామూర్తులను కూరగాయల దండలతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయ అలంకరణ, కదంబ ప్రసాదం తయారీకి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల కూరగాయలను వినియోగించారు. కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల దాతల నుంచి వీటిని సేకరించారు. శాకంబరీగా కొలువుతీరిన దుర్గమ్మ దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. శాకంబరీ నమోస్తుతే అంటూ స్మరించుకున్నారు. 6

విద్యుత్ ఏఈ రూటే సపరేటు!

బందరు మండలంలో అవినీతి దందా!

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.50వేలు లంచం!

బందరు మండలంలోని విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ పని కావాలన్నా చేయి తడపాల్సిందేనని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీగా విద్యుత్ బకాయిలు పేరుకుపోయిన కొందరు ఆక్వా రైతులకు కొత్త కనెక్షన్లు ఇచ్చి వారి వద్ద భారీగా ముడుపులు దండుకుంటున్నట్టు సమాచారం. ప్రజాప్రతినిధులతో సిఫార్సు చేయిస్తే పనులు కావు.. నేను చెప్పినట్టు వింటే మీ పనులు ఇట్టే అయిపోతాయంటూ తనదైన శైలిలో బేరానికి దిగుతున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి అవినీతి ఏఈ మాకొద్దు అంటూ ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేసేందుకు రెండు, మూడు గ్రామాల రైతులు సంతకాలు సేకరిస్తున్నారు.

- బకాయి ఉన్న ఆక్వా రైతులకు కొత్త కనెక్షన్‌లు
- ఇందుకుగాను భారీగా ముడుపులు వసూలు
- ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు చెప్పినా మారని తీరు
- అవినీతి ఏఈ మాకొద్దంటూ సంతకాలు సేకరిస్తున్న రైతులు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు మండలం వెంకటదుర్గాంబపురంలో 50కిపైగా రొయ్యల చెరువుల వద్ద ట్రాన్స్ ఫార్మర్‌లు ఉన్నాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. దీంతో సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌లకు విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఇదే అంశాన్ని విద్యుత్ శాఖ ఏఈ తనకు అనుకూలంగా మలచుకున్నాడు. విద్యుత్ మిగతా 6లో..

కాంట్రాక్టర్ హవా!

విద్యుత్‌శాఖ అధికారులు, ఒక కాంట్రాక్టర్ కూడబలుక్కుని మండలంలోని ఆక్వా చెరువుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. రైతులు ట్రాన్స్ ఫార్మర్‌ల కోసం నగదు చెల్లించినప్పటికీ, ఏఈ అడిగినంత మేర నగదు ఇవ్వకుంటే మాత్రం పలు కారణాలు చూపి ట్రాన్స్ ఫార్మర్‌లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఏఈ మాటను తూచా తప్పకుండా పాటించే కాంట్రాక్టర్ తనదైన శైలిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన ఈ కాంట్రాక్టర్, కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతుండటం, అధికారులు చెప్పిన పనులే చేస్తుండటం గమనార్హం.

రూ. కోటి పరిహారం కాలదన్నుకున్నారు!

గూడవల్లిలో దుర్గామల్లేశ్వరస్వామి దత్తత ఆలయం

- కోదండ రామాలయానికి సర్వే నెంబరు 202/1లో 6.25 ఎకరాల భూమి
- బుడమేరు విస్తరణ కోసం 2.69 ఎకరాలు తవ్వేసిన ఇరిగేషన్‌శాఖ
- ఇప్పటి వరకు పరిహారం కోరని దేవస్థానం అధికారులు
- స్థానికుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశించిన విజయవాడ ఆర్డీవో
- విజయవాడ రూరల్ తహసీల్దార్ పరిశీలన.. నష్టపరిహారానికి సిఫార్సు

దుర్గామల్లేశ్వరస్వామి దత్తత ఆలయమైన గూడవల్లిలోని కోదండరామాలయం భూముల విషయంలో దేవదాయశాఖ నిర్లక్ష్యం మరొకటి వెలుగు చూసింది. గూడవల్లిలో బుడమేరు కాలువ వెంబడి ఉన్న భూములను కాలువ విస్తరణ కోసం తీసుకున్నారు. ఈ విషయం ఇప్పటి వరకు దేవస్థానం అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా ఈ భూములకు రావాల్సిన పరిహారం రూ. కోటి వరకు దేవస్థానం కోల్పోవాల్సి వచ్చింది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లా గూడవల్లిలోని సర్వే నెంబర్ 202/1లో 6.25 ఎకరాల భూమి ఉంది. బుడమేరు కాలువ పక్కనే ఈ భూములు ఉన్నాయి. ఐదేళ్ల కిందట బుడమేరు ఆధునీకరణ పనుల నిమిత్తం కాలువను విస్తరించాల్సి వచ్చింది. ఇరిగేషన్ ప్రతిపాదనల మేరకు అప్పటి జిల్లా యంత్రాంగం భూ సేకరణకు శ్రీకారం చుట్టింది. కాలువ పక్కనే ఉండటం వల్ల దుర్గామల్లేశ్వరస్వామి దత్తత ఆలయమైన కోదండరామాలయానికి చెందిన 6.25 ఎకరాలలో 3.60 సెంట్ల భూమి కావాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత విస్తరణలో భాగంగా 2.69 ఎకరాల భూమిని మాత్రమే మిగతా 6లో..

భూములపై ఎందుకింత నిర్లక్ష్యం?

గూడవల్లిలోని కోదండ రామాలయానికి గ్రామంలోనే సర్వే నెంబర్ 314లో 1.10 ఎకరాలు, సర్వే నెంబర్ 23/3ఏలో 1.50 ఎకరాలు, సర్వే నెంబరు 207లో 8 ఎకరాలు, సర్వే నెంబర్ 202/1, 2022/3లో 8.27 ఎకరాలు మాగాణి భూమి ఉంది. నందివాడ మండలం ఇలపర్రు గ్రామంలోని సర్వే నెంబర్ 334లో 8.24 ఎకరాల మాగాణి భూమి ఉంది. దీన్ని చేపల చెరువుగా తవ్వేశారు. కోదండరామాలయం భూములపై దేవస్థాన అధికారులు, దేవదాయ శాఖ అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం చూపుతున్నారో అర్థం కావటం లేదు.

యూపిక్స్ సినీ యానిమేషన్స్ సంస్థలో కోట్లాది రూపాయలుగా వచ్చిన పెట్టుబడిలో నల్లధనం ఉందా? కోట్లు పెట్టుబడిగా పెట్టామని లబోదిబోమంటున్న బాధితుల చేతికి నల్ల మరక అంటుకుందా? అంటే అవుననే సమాధానం దర్యాప్తు బృందాల నుంచి వస్తోంది. రూ.లక్ష పెట్టుబడిగా పెడితే ఏడాది తర్వాత రూ.2లక్షలు ఇస్తానని నిడుమోలు కిరణ్ ప్రకటన చేయగానే జనం ఎగబడి డబ్బులు పెట్టారు. కొంతమంది కోట్లాది రూపాయలు పెట్టారు. ఇలా యూపిక్స్‌లోకి పెట్టుబడిగా వచ్చిన మొత్తంలో నల్లధనం ఎక్కువగా ఉందని పోలీసులు గుర్తించారు.

వైట్‌కాలర్‌లో బ్లాక్ మనీ



అద్విక, యూపిక్స్ ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం!

- న్యాయస్థానంలో మెమో దాఖలు చేయాలని అధికారుల నిర్ణయం
- యూపిక్స్ యజమాని కిరణ్ పేరుతో రూ.23 కోట్ల ఆస్తులు
- అద్విక ఆదిత్య పేరుతో రూ.10కోట్ల ఆస్తులు ఉంటాయని అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొద్దిరోజులు అద్విక, యూపిక్స్ సంస్థల అధినేతలను పోలీసులు విచారిస్తున్న విషయం తెలిసిందే. యూపిక్స్ అధినేత కిరణ్ ముందుగా పల్నాడు జిల్లా నుంచి వసూళ్ల పర్వం ప్రారంభించాడు. ఇలా ఒక్కో జిల్లా దాటుకుంటూ విజయవాడలో అడుగుపెట్టాడు. ఇందులో మొత్తం రూ.178 కోట్లు పెట్టుబడులుగా వచ్చాయని దర్యాప్తు బృందాలు గుర్తించాయి. ఈ మొత్తంలో సగం వరకు నల్లధనం ఉందని భావిస్తున్నారు. పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు, ముగ్గురు ఒక గ్రూపుగా ఏర్పడి కోట్లలో పెట్టుబడి పెట్టినట్టు తేలింది. వాళ్లంతా చుట్టుపక్కల ఉన్న వారిలో ఆశలు రేకెత్తించడానికి ఈ విధంగా గ్రూపుగా ఏర్పడ్డారని గ్రహించారు. ఈ గ్రూపు మొత్తం సుమారుగా రూ.50-60కోట్లు పెట్టుబడిగా పెట్టింది. ఇదంతా నల్లధనమే అని పోలీసులు గుర్తించారు.

ఆస్తుల జప్తునకు అడుగులు

రెట్టింపు అన్న పదాన్ని జనంలోకి విస్తృతంగా తీసుకువెళ్లి కోట్లాది రూపాయలను వసూలు చేసి నిలువునా ముంచేసిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్, యూపిక్స్ సినీ యానిమేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమానుల పేరుతో ఉన్న ఆస్తులను జప్తు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆస్తులను గుర్తించిన అధికారులు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకున్నారు. వాటిని జప్తు చేయాలని న్యాయస్థానంలో మెమో దాఖలు చేయబోతున్నారు. యూపిక్స్ అధినేత నిడుమోలు కిరణ్ పేరుతో రూ.23కోట్ల ఆస్తులు ఉన్నట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. అద్విక ట్రేడింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య పేరున సుమారుగా మిగతా 6లో..

ఇంకా ఆపరేటర్లు!

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఆగని రేషన్ దందా!

డీలర్ల వద్ద గుమస్తాలుగా ఎండీయూ ఆపరేటర్లు



రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ఎండీయూ ఆపరేటర్ల పాత్ర ఇంకా కొనసాగుతూనే ఉంది. అవినీతికి అలవాటుపడిన కొందరు రేషన్ డీలర్లు వీరిని తమ వద్ద గుమస్తాలుగా నియమించుకున్నారు. వీరి ద్వారా కార్డుదారులకు ఫోన్లు చేసి భారీగా బియ్యం కొనుగోళ్లకు పాల్పడుతున్నారు. ఎండీయూ ఆపరేటర్లకు దూరంగా ఉండాలని రేషన్ డీలర్లకు సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు.

- కార్డుదారులకు ఫోన్లు.. భారీగా బియ్యం కొనుగోళ్లు
- ఎండీయూ వాహనాల్లో రైస్ మిల్లులకు తరలింపు
- విజయవాడలో ఆపరేటర్లను పట్టుకున్న పోలీసులు
- కృష్ణాజిల్లా గూడూరులోని ఓ రైస్ మిల్లులో బియ్యం సీజ్ చేసిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లకు రేషన్ దుకాణాలు పునరావాస కేంద్రాలుగా మారాయి. కొందరు రేషన్ డీలర్లు తమ దుకాణాల్లో ఎండీయూ ఆపరేటర్లను గుమాస్తాలుగా నియమించుకున్నారు. కార్డుదారుల నుంచి పెద్ద ఎత్తున బియ్యం కొనుగోలు చేయటానికి వీరిని వాడుకుంటున్నారు. దీంతో ఈ నెలలో కూడా పేదల బియ్యం భారీగా పక్కదారి పడుతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 100 శాతం దాటి కూడా పంపిణీ చేసిన డీలర్లు కొందరైతే 50 శాతం లోపు పంపిణీ చేసిన డీలర్లు మరికొందరు ఉన్నారు. గతంలో డోర్ డెలివరీ ఉన్నప్పుడు మిగతా 6లో..

డీలర్ల వద్ద ఉద్యోగం

ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం మండలాల పరిధిలో పెద్ద ఎత్తున డీలర్లు ఎండీయూ ఆపరేటర్లను గుమాస్తాలుగా నియమించుకున్నారు. విజయవాడ నగరంలో కృష్ణలంక, టూటౌన్, పటమట, గుణదల తదితర ప్రాంతాల్లో ఎండీయూ ఆపరేటర్లను రేషన్ డీలర్లు తమ ఉద్యోగులుగా చేర్చుకున్నారు. కృష్ణాజిల్లాలో ప్రధానంగా గుడివాడ, కంకిపాడు, గన్నవరం, అవనిగడ్డ, మచిలీపట్నం, కోడూరు మండలాల పరిధిలోని రేషన్ డీలర్లు తమ షాపుల్లో ఎండీయూ ఆపరేటర్లను పెట్టుకుని నడుపుతున్నారు. ఎండీయూ ఆపరేటర్లను తొలగించిన తర్వాత వారితో సంబంధాలు కొనసాగించవద్దని, వారిని దగ్గరకు తీసుకోవద్దని సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కూడా రేషన్ డీలర్లు బేఖాతర్ చేస్తున్నారు.

రేటు పెంచి కొంటున్నారు!

కార్డుదారులను ఆకర్షించటానికి రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తెలివైన ఎత్తుగడ వేశారు. గతంలో రూ.10లకు ఎండీయూ ఆపరేటర్లు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసేవారు. ఇప్పుడు రేషన్ డీలర్లు ఈ ధరను అమాంతం పెంచేశారు. కేజీకి రూ.13 నుంచి రూ. 14 వరకు చెల్లిస్తామని ఎండీయూ ఆపరేటర్ల ద్వారా కార్డుదారులకు ఫోన్లు చేయిస్తున్నారు. దీంతో ధర ఎక్కువగా పలకటంతో కార్డుదారులు కూడా ఎండీయూ ఆపరేటర్లు చెప్పే దుకాణాలకే వెళుతున్నారు. ఈ ధరను ఎందుకు పెంచారన్నదానికి కూడా కారణం ఉంది. రేషన్ బియ్యంలో అనేక పోషకాలు ఉంటాయి. ఆఫ్రికా దేశాల్లో పెద్ద ఎత్తున వీటికి డిమాండ్ ఉంది. ఇటీవల కాలంలో ధర కూడా బాగా పలుకుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రూ.3 నుంచి రూ. 4 వరకు అదనంగా పెంపుదల చేశారు.



పేదరికాన్ని కలిసికట్టుగా రూపుమాపుదాం

- మంత్రి కొల్లు రవీంద్ర 6

'కూచిపూడి' అభివృద్ధికి చర్యలు తీసుకోండి

- కలెక్టర్ డి.కె.బాలాజీ 6



ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పీఆర్ అండ్ ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ 8

రుద్రవరంలో వ్యవసాయ కార్మికుడి హత్య

ఐదుగురిపై కేసు నమోదు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం







దుర్గగుడి ఆలయ ప్రాంగణంలో కూరగాయలతో అలంకారం



కూరగాయలతో తోరణాలు..

తలపై పొంగళ్లతో దుర్గమ్మ సేవకు..

అంతర్యాసినీ..

» దుర్గగుడిలో ఘనంగా శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీ చక్రంలో అంతర్యాసినిగా సకల లోకాలకు శుభములు చేకూర్చిన శాకంబరీ ఉత్సవాలు ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మంగళవారం వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు పండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య, భక్తుల కోలాహంతో కనకదుర్గమ్మ శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. గత 18 సంవత్సరాలుగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు శాకంబరీ ఉత్సవాలను మూడురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో



ఈనెల 8, 9, 10 తేదీల్లో ఆషాఢ శుద్ధ త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి తిథులలో మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు కనకదుర్గమ్మను, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో దేవతలకు కూరగాయలతో అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణాన్ని శోభయమానంగా అలంకరించారు. ఏటా ఆషాఢ మాసంలో తొలి తొమ్మిదిరోజులు శాకంబరీ నవరాత్రుల పేరిట అమ్మవారు పూజలు అందుకుంటుంది. శాకంబరీ నవరాత్రులను తెలంగాణలోని వరంగల్‌లో భద్రకాళి అమ్మవారికి విశేషంగా నిర్వహిస్తారు. వరంగల్‌లో భద్రకాళి అమ్మవారికి జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల తీరును పరిశీలించి నాటి ఈవో చంద్రశేఖర్ అజాద్ 2007లో శాకంబరీ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శాకంబరి ఉత్సవాలలో మూడురోజులు దాతలు ఇచ్చిన కూరగాయలతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించటం విశేషం. అమ్మవారికి కదంబం అంటే అన్నిరకాల కూరగాయలతో వండిన అన్నాన్ని నైవేద్యంగా పెట్టడం ఓ ప్రత్యేకత.

శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

మంగళవారం ఉదయం శాకంబరీ ఉత్సవాల ప్రారంభ పూజలో ఈవో శీనానాయక్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి హారతి ఇచ్చి దర్శనాలను ప్రారంభింపజేశారు. కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన 50 మెట్రిక్ టన్నుల కూరగాయలను మంగళవారం అలంకరణకు వినియోగించారు. వివిధ ప్రాంతాలనుంచి అమ్మవారిని దర్శించుకోవటానికి భక్తులు తరలివచ్చారు. ఇదే సమయంలో ఆషాఢసారె ఉత్సవాలు కూడా జరుగుతుండటంతో మహిళాభక్తులతో ఆలయ ప్రాంగణం శోభాయమానంగా కనిపిస్తోంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు ప్రత్యేక దర్శనాలు, అంతరాలయ దర్శనాలను రద్దు చేసి, సామాన్య భక్తులకు అవకాశం కల్పించారు. ఈ ఉత్సవాలు గురువారంతో ముగుస్తాయి.



భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాల సందర్భంగా మంగళ, బుధ, గురువారాలలో కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. కాయగూరలు, కందిపప్పు, ఇతర దినుసులు వేసి కదంబ ప్రసాదాన్ని ప్రత్యేకంగా తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈవో శీనానాయక్ తొలిరోజు ప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఈవో, అధికారులు

కనకదుర్గానగర్‌లో సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసు

ఇంద్రకీలాద్రి : దుర్గగుడి దిగువన కనకదుర్గానగర్‌కు సమీపాన ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో దుర్గామల్లేశ్వర దేవస్థానం సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసు (సీఆర్‌ఓ)ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం ఆ ప్రదేశాన్ని ఈవో శీనానాయక్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. సీఆర్వో ఆఫీసు, ప్రసాదం కౌంటర్, దేవస్థానం పబ్లికేషన్ స్టాల్, ఆర్జిత సేవల బుకింగ్, తదితరాలన్నీ కూడా ఒకే చోట ఏర్పాటు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.

దసరాకు అందుబాటులోకి భవనాలు

దసరా మహోత్సవాలకు దేవస్థానం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న అన్నదానం, లడ్డూ ప్రసాదం తయారీ భవనాలను భక్తులకు తాత్కాలికంగా అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు పనులను వేగవంతంగా చేపట్టాలని ఈవో ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అన్నదాన, లడ్డూ ప్రసాద తయారీ భవనాలను ఎగ్జిక్యూటివ్ కె.వి.ఎస్.ఆర్ కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. దసరాలోగా భవనాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని


మహనీయుల ఆశయాలు స్ఫూర్తిదాయకం

» ఎంపీ కేశినేని శివనాథ్

ఎ.కొండూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ నేటితరానికి స్ఫూర్తిదాయకమని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మంగళవారం మండలంలోని పోలిశెట్టిపాడులో బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పేదప్రజల అభ్యున్నతికి మహనీయుల కృషి మరువలేనిదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 విధానం ద్వారా పేదరిక నిర్మూల కోసం కృషి చేస్తున్నారన్నారు. తిరువూరు నియోజకవర్గంలో త్వరలో ముఖ్యమంత్రి పీ-4పై బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, శావల దేవదత్, వాసం మునియ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూచిపూడి' అభివృద్ధికి చర్యలు తీసుకోండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధితోపాటు, కూచిపూడి నాట్యంలో ఉపయోగించేందుకు స్థానిక మహిళలు తయారుచేస్తున్న దుస్తులు, ఇతర ఆభరణాల విక్రయానికి మార్కెట్ సదుపాయం కల్పించాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో జేసీ గీతాంజలిశర్మతో కలిసి కూచిపూడి గ్రామ అభివృద్ధిపై మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామంలోని 25 మంది స్వయంసహాయక సంఘాల్లోని మహిళలకు జీవనోపాధి కల్పించేందుకుగాను కూచిపూడి నృత్య దుస్తులు, ఆభరణాలు తయారుచేయడంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అన్ని విద్యాసంస్థలు ఇక్కడ తయారవుతున్న దుస్తులు, ఆభరణాలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కూచిపూడి గ్రామాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలన్నారు. కూచిపూడి నాట్యానికి సంబంధించిన విగ్రహాలను పలుకూడళ్లలో ఏర్పాటుచేసి సుందరంగా గ్రామాన్ని తీర్చిదిద్దాలన్నారు. గ్రామీణ స్వచ్ఛ అభియాన్ పథకం ద్వారా కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాక్షేత్రంలో మ్యూజియం, ప్రకృతిక్షేత్రం, కోనేరులకు కనీస వసతులను కల్పించేందుకు తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కూచిపూడి నాట్య ప్రముఖుడు వెంపటి గోపాలకృష్ణ మాట్లాడుతూ, కూచిపూడి గ్రామంలో డంపింగ్‌యార్డ్, శ్మశానవాటికలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందుల పడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ వాటి ఏర్పాటుకు భూమిని సేకరించాలని మొవ్వ తహసీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్, జిల్లా టూరిజం అధికారి రామ్‌లక్ష్మణ్, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీవో సుహాసిని పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా!

» ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణాలు
» కాసుల కక్కుర్తిలో పలుశాఖల అధికారులు
» ఆయకట్టు రైతులకు విఘాతం

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి)

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ వద్ద తారకరామ ఎత్తిపోతల పథకం కాలువకు సంబంధించిన ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఆక్రమణలు నిలువరించాల్సిన పలుశాఖల అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆక్రమణదారులు శాశ్వత గృహాలు ఏకంగా రెండు, మూడు అంతస్తుల్లో నిర్మించేస్తున్నారు.

ఇటీవలి కాలంలో ఇరిగేషన్ స్థలాలను దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు ఆక్రమణదారుల నుంచి ఇరిగేషన్ స్థలాన్ని కొనుగోలు చేసిన ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగి సదరు స్థలంలో ఏకంగా రెండస్థుల నిర్మాణం చేపట్టాడు. అక్రమ నిర్మాణంపై మున్సిపల్‌శాఖకు ఫిర్యాదులు రావడంతో భవన నిర్మాణదారునికి అధికారులు నోటీసులు జారీచేశారు. ఫిర్యాదులు వచ్చే వరకు ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు మిన్నకుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు అందుతున్నాయన్నది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తారకరామ కాల్వకు చెందిన స్థలాన్ని కబ్జాకోరల నుంచి కాపాడాలని పలువురు రైతులు, ప్రజలు కోరుతున్నారు.





ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణాలు

● తారకరామ ఎత్తిపోతల పథకానికి చెందిన కాల్వ కింద సుమారు 13,820 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఈలప్రోలు, శాంతినగర్, కవులూరు, కట్టుబడిపాలెం, పినపాక, జి.కొండూరు, గడ్డమణుగు, వెలగలేరు, తదితర గ్రామాల్లో ఉన్న పొలాలకు సాగునీరు అందించేందుకు నిర్దేశించబడిన కాలువ ఇది. ప్రస్తుతం ఆక్రమణలతో కాలువ స్థలం కుచించుకుపోయింది. కాలువకు ఆనుకుని చాలామంది ఇప్పటికే నిర్మాణాలు చేపట్టారు. భవిష్యత్‌లో కాలువను వెడల్పు చేయాలంటే అధికారులకు తలనొప్పి తప్పేలా లేదు. కాలువ మట్టి కూడా తరలిపోవడంతో పాటు ఏకంగా కాలువ స్థలాన్నే కబ్జా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులకు చీమ కుట్టినట్టు లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం

- రమ్య కీర్తన, కొండపల్లి మున్సిపల్ కమిషనర్

ఇప్పటికే నిర్మాణదారునికి రెండుసార్లు నోటీసులు జారీ చేశాం. బఫర్‌జోన్‌లో భవనం ఉన్నట్టు గుర్తించాం. నిర్మాణాన్ని నిలుదలచేశాం. మరోమారు నోటీసు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటాం. ఈ వ్యవహారంలో ముడుపులు తీసుకున్నట్టు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలకు సిఫార్స్ చేస్తాం.

పేదరికాన్ని కలిసికట్టుగా రూపుమాపుదాం

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంలో భాగంగా పీపుల్, పబ్లిక్, ప్రైవేటు, పార్టనర్‌షిప్ విధానం ద్వారా పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ సమావేశపు హాలులో కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి పి-4 కార్యక్రమ అమలుపై మచిలీపట్నం, బందరు రూరల్ మండలం సచివాలయ సిబ్బంది, అధికారులు, పార్టీ పెద్దలతో కలిసి మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 లక్ష్యాలను మంత్రి వివరించారు. మెరుగైన సమాజం కోసం సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. 2029 నాటికి సమాజంలో



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

పేదరికాన్ని రూపుమాపే లక్ష్యంతో ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

19,17,151 బంగారు కుటుంబాలకు 10,343 మంది మార్గదర్శుల దత్తత

ఆంధ్రప్రదేశ్‌లో 19,17,151 బంగారు కుటుంబాలను గుర్తించామని, అందులో 1,64,546 పేద కుటుంబాలను 10,343 మంది మార్గదర్శులు దత్తత తీసుకుంటారన్నారు. కృష్ణాజిల్లాలో 68,948 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఇప్పటికి 2723 కుటుంబాలను 344 మంది మార్గదర్శులు దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చారన్నారు. నియోజకవర్గంలో 9778 బంగారు కుటుంబాలను గుర్తించామని, అందులో 106 మార్గదర్శులు దత్తత తీసుకున్నారన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, పిల్లల చదువుకు దాతలు చేయూత నివ్వాలన్నారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, మచిలీపట్నం నియోజకవర్గ ప్రత్యేకాధికారి, మార్కెటింగ్ ఏడీ నిత్యానంద, మండల ప్రత్యేకాధికారి శివరామ్‌ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఈ రూటే సపరేటు!

(5వ పేజీ తరువాయి)

బకాయిలను పక్కనపెట్టి, వేరే వ్యక్తుల పేరుతో నూతన కనెక్షన్ ఇస్తానని, ఇందుకు తనకు ఒక్కో కనెక్షన్‌కు పెద్ద మొత్తంలో నగదు ఇవ్వాలని తెర వెనుక బేరం పెట్టాడు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్‌ల పరిధిలో నూతన కనెక్షన్‌లు కూడా ఇచ్చాడు. ఈ విషయం బయటకు రావడంతో ఈ ఏఈ అవినీతి వ్యవహారం బయటపడింది. ఇదే గ్రామంలో ఒక రొయ్యల చెరువు యజమాని తన పేరున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తన పొలంలో మరో ప్రాంతానికి మార్చాలని ఏఈ వద్దకు వెళ్లారు. తాను చెప్పినంత నగదు ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు మారుస్తానని ఏఈ స్పష్టం చేసినట్టు తెలిసింది. పలుమార్లు ఏఈ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో సదరు రైతు మంత్రి కొల్లు రవీంద్రకు నేరుగా ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై స్పందించిన మంత్రి రవీంద్ర వెంకటదుర్గాంబపురంలో విద్యుత్‌శాఖ ఏఈ చేస్తున్న అక్రమాలపై విచారణ చేయాలని డీఈని ఆదేశించారు. డీఈ ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేసిన సమయంలో రూ.4.80 లక్షల విద్యుత్ బకాయి ఉన్న రైతు కనెక్షన్‌ను తొలగించి, అదే రైతు భార్యపేరున నూతన కనెక్షన్ ఇచ్చినట్టు తేలింది. రూ.3 కోట్ల వరకు ఈ గ్రామం నుంచి విద్యుత్ బకాయిలు ఉన్నట్టు డీఈ పరిశీలనలో వెల్లడైనట్లు సమాచారం.

ఆక్వా రైతుల సంతకాల సేకరణ

రైతులను ఇబ్బంది పెట్టవద్దని సదరు ఏఈని కూటమి నాయకులు పలుమార్లు సున్నితంగా హెచ్చరించారు. అయినా ఏఈ తన పద్ధతి మార్చుకోకుండా మరింతగా తన అక్రమాలను కొనసాగిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన మూడు, నాలుగు గ్రామాలకు చెందిన ఆక్వా రైతులు రెండు రోజుల క్రితం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఏఈ మాకు వద్దు, వేరే మండలానికి బదిలీ చేయాలని సంతకాల సేకరణ చేస్తున్నారు.

వైట్‌కాలర్‌లో బ్లాక్ మనీ

(5వ పేజీ తరువాయి)

రూ.10 కోట్ల వరకు ఆస్తులు ఉన్నాయన్న అంచనా వేశారు. వీటిని జప్తు చేయడం ద్వారా బాధితులకు న్యాయం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు కంపెనీలలో మోసపోయిన బాధితుల లెక్కలను పోలీసులు పక్కాగా తేల్చారు. యూపిక్స్ కంపెనీలో రూ.178కోట్ల లావాదేవీలు జరిగినట్టు అధికారులు నిర్ధారించారు. అందులో రూ.123 కోట్లు ఏజెంట్లకు కస్టమర్లకు చెల్లించినట్టు తేలింది. ఈ డబ్బులతో ఆ కంపెనీ ఎండీ కిరణ్ పలు చోట్ల స్థిరాస్తులను కొన్నట్టు నిర్ధారించారు.

ఫారెక్స్ ట్రేడింగ్‌లో అద్విక

అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఆదిత్య ఏజెంట్లు, కస్టమర్ల ద్వారా సేకరించిన డబ్బులను దుబాయిలోని ఫారెక్స్ ట్రేడింగ్‌లో పెట్టినట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడి నుంచి హవాలా మార్గంలో దుబాయికి ఈ డబ్బులను ఆదిత్య పంపించాడు. ఈ ఫారెక్స్ ట్రేడింగ్‌లో షేర్ల విలువ రోజురోజుకు పడిపోతున్నట్టు దర్యాప్తు బృందాలు కనుగొన్నాయి. రెండు రోజుల క్రితం వరకు రూ.3.50లు ఉన్న షేరు విలువ మంగళవారం నాటికి మూడు రూపాయలకు పడిపోయింది. ఇలా పడిపోతే అసలుకే నష్టం వస్తుందని కమిషనరేట్ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. కస్టమర్ల ద్వారా ఆదిత్య పెట్టుబడులుగా తీసుకొన్న డబ్బులను ఫారెక్స్ ట్రేడింగ్‌లో పెట్టినట్టు డీజీపీకి తెలియజేశారు. దీనిపై ఒక నిర్ణయాన్ని తీసుకోవలసి ఉందని సమాచారం ఇచ్చారు. ఫారెక్స్ ట్రేడింగ్‌లో ఉన్న షేర్లను మూసివేస్తే ఆ డబ్బు వెంటనే హవాలా రూపంలో ఆదిత్యకు చేరుతుంది. ఇలా చేస్తే లేనిపోని ఆరోపణలను మూటకట్టుకోవాల్సి వస్తుందని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఉన్నతాధికారుల, న్యాయనిపుణుల సలహా తీసుకుని డబ్బును రప్పించడానికి రంగం సిద్ధం చేశారు.

69 పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలు

(5వ పేజీ తరువాయి)

ప్రకటించారు. 2018 నుంచి పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరపలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినా ఐదేళ్ల పాటు త్రీమెన్ కమిటీలనే నియమించి కొనసాగించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ ఎన్నికలు జరపకుండా త్రీమెన్ కమిటీలనే నియమించింది. పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిపితే 10 నుంచి 12 మంది సభ్యులను ఎన్నుకుంటారు. మరో ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులను నియమిస్తారు. దీంతో పీఏసీఎస్‌లలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. త్రీమెన్ కమిటీల నియామకం కారణంగా పీఏసీఎస్‌ల పనితీరుపై పర్యవేక్షణ కొరవడుతుందని సహకార రంగంలోని నిపుణులు చెబుతున్నారు.



'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఉండవల్లి శ్రీదేవి, దేవినేని, తుమ్మలపల్లి తదితరులు

మహిళల్ని టచ్ చేసి చూడండి.. సీఎం చంద్రబాబు తాట తీస్తారు

» 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో ఉండవల్లి శ్రీదేవి

కంకిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను టచ్ చేసి చూడండి.. తాట తీస్తా.. ఎవరినీ సహించేది లేదని మృగాళ్లకు హెచ్చరిక చేసిన నేత సీఎం చంద్రబాబు అని మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో మంగళవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో మహిళలపై దాడులు, గంజాయితో రాష్ట్రాన్ని అంధకార ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని మండిపడ్డారు. నేడు కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధిలోనూ పరుగులు తీయిస్తున్నదన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఏడాది కాలంలో రూ.76 కోట్లతో రహదారులు, డ్రెయిన్లతో పాటు పలు అభివృద్ధి పనులు చేసి చూపించారన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల జనవరి నాటికి జగన్ రెడ్డి సాక్షి క్యాలెండర్ విడుదల చేశాడే తప్ప, జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రధాన రహదారులను రూ. 4500 కోట్లతో ఏడాదిలోనే అభివృద్ధి చేసి చూపించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తుమ్మలపల్లి హరికృష్ణ, క్లస్టర్ కో-కన్వీనర్ పులి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఆపరేటర్లు!

(5వ పేజీ తరువాయి)

ఎండీయూ ఆపరేటర్లు అనేక చౌక దుకాణాల పరిధిలో రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ పంపిణీ చేసేవారు. వీరికి కార్డుదారులెవరు బియ్యాన్ని తిరిగి విక్రయిస్తారో తెలుసు. ఇలా విక్రయించేవారి ఫోన్ నెంబర్లన్నీ కూడా ఎండీయూ ఆపరేటర్ల దగ్గర ఉన్నాయి. ప్రస్తుతం డీలర్ల దగ్గర గుమాస్తాలుగా పనిచేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు ఫోన్లు చేసి బియ్యాన్ని కొనుగోలు చేస్తామని, తాము ఉన్న డిపోలకు రావాలంటూ చెబుతున్నారు. దీంతో డబ్బులు ఎక్కువ వస్తున్నాయన్న ఉద్దేశంతో కార్డుదారులు ఆ రేషన్ దుకాణానికి వెళుతున్నారు. ఇలా ఎండీయూ ఆపరేటర్లు ఉన్న డిపోలలో 100 శాతం కూడా పంపిణీ దాటి పోతోంది. బియ్యం కొంటారన్న ఉద్దేశంతో తమ పరిధిలోని రేషన్ దుకాణాలను కూడా కాదని కార్డుదారులు ఎండీయూ ఆపరేటర్లు పనిచేస్తున్న దుకాణాల దగ్గరకు వెళ్లి బయోమెట్రిక్ వేసి బియ్యాన్ని వారికే విక్రయిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న డిపోలలో 50 శాతం మేర పంపిణీ పడిపోయింది.

పోలీసులకు పట్టుబడుతున్న ఎండీయూ ఆపరేటర్లు

జూలై నెల కోటా ప్రారంభం కాగానే కొంతమంది ఎండీయూ ఆపరేటర్లు రేషన్ బియ్యాన్ని వాహనాలలో తరలిస్తూ పలు చోట్ల పోలీసులకు పట్టుబడ్డారు. పటమట నల్లూరి సత్యనారాయణ నగర్‌కు చెందిన పందిరిపల్లి మల్లికార్జున, బావాజీపేటకు చెందిన కురిటి దుర్గాప్రసాద్‌లను తమ వాహనాలలో బియ్యం బస్తాలను తరలిస్తుండగా మాచవరం పోలీసులు పట్టుకున్నారు. కృష్ణాజిల్లా గూడూరులో గోమతి రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు జరిపి.. ఆవరణలో ఉన్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. దీనిని బట్టి ఏ స్థాయిలో ఎండీయూ ఆపరేటర్ల ద్వారా బియ్యం తరలిపోతోందో అర్థం చేసుకోవచ్చు.

రూ.కోటి పరిహారాన్ని..

(5వ పేజీ తరువాయి)

తవ్వారు. కానీ, దేవస్థానానికి ఎలాంటి పరిహారాన్ని చెల్లించలేదు. కనీసం దేవస్థాన భూములను తీసుకుంటున్నట్టు కూడా తెలపలేదు. కాలువ తవ్విన తర్వాత విషయం తెలిసినా అటు దేవస్థానం అధికారులు కానీ, ఇటు దేవదాయ శాఖ అధికారులు కానీ పరిహారాన్ని డిమాండ్ చేయలేదు. ఇదిలా ఉండగా.. స్థానికులు కొందరు విజయవాడ ఆర్డీవోకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. దీంతో విజయవాడ ఆర్డీవో విచారణకు ఆదేశించారు. విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణకు బాధ్యతలు అప్పగించారు. ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ జరిపి ఆర్డీవోకు నివేదిక ఇచ్చారు. కోదండరామాలయానికి ఎంత భూమి ఉంది? ఎంత అప్పట్లో తవ్వటం జరిగింది? అన్న వివరాలను పొందుపరుస్తూ ఈ భూములకు నష్టపరిహారం చెల్లించాలని సిఫార్సు చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా తహశీల్దార్ కోరారు. దీనిని బట్టి పరిహారానికి అర్హతమైనదని తెలుస్తోంది. స్థానిక ప్రజలు చూపిస్తున్న శ్రద్ధను దేవస్థాన అధికారులు కానీ, దేవదాయశాఖ అధికారులు కానీ మచ్చుకు కూడా శ్రద్ధ చూపించటం లేదు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి



ఉంగుటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్న మొక్కలు పెంపకం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొలుసు రవీంద్రబాబు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మెగా ఉద్యాన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పలు పాఠశాలలు, చెరువుల గట్లపై పండ్లు, కాయ జాతి మొక్కలు నాటారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఏపీవో టి.వినీల, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలించిన కమిషనర్

కానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కానూరు బందరురోడ్డులోని కృష్ణ స్వీట్ దుకాణం పక్కన అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీని మంగళవారం తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ పరిశీలించారు. డ్రెయినేజ్ నుంచి మురుగునీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన కొడుతోందని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో డ్రెయినేజీని పరిశీలించారు.

విద్యార్థినికి నగదు బహుమతి

ఉయ్యూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థిని షబానాకు రూ. 20వేల ప్రోత్సాహక నగదు బహుమతి కె. నాగేశ్వరరావు రోటరీక్లబ్ ద్వారా మంగళవారం అందజేశారు. రోటరీక్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. వీఆర్‌కె ఎం స్కూల్ హెచ్‌ఎం యలమంచిలి వెంకటేశ్వరరావు, రోటరీక్లబ్ సెక్రటరీ అమీర్ మీర్జా, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు, శానిటరీ ప్యాడ్‌ల పంపిణీ

కానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అన్నే ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం కానూరులోని వాసవి మహిళా మండలి చిల్డ్రన్ హోమ్‌లో వందమంది విద్యార్థినులకు నోట్ పుస్తకాలు, శానిటరీ ప్యాడ్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నే తారకృష్ణ, అన్నే మీరాకృష్ణ, వేమూరి దీప్తివర్ధని, అన్నే శ్రావణ్‌కుమార్, అరవింద్, రాజా, వంగర అప్పు తదితరులు పాల్గొన్నారు.

యూఎఫ్ ఆర్టీఐ కోస్తా జిల్లాల అధ్యక్షుడిగా బేతపూడి

ఉయ్యూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : యూనైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ కోస్తా జిల్లాల అధ్యక్షుడిగా గండిగుంట ఆనందపురానికి చెందిన బేతపూడి జోగేశ్వర రావు నియమితులయ్యారు. సమాచార హక్కు చట్టం సీనియర్ నాయకుడు బేతపూడి జోగేశ్వర రావును కోస్తాజిల్లాల అధ్యక్షుడిగా నియమిస్తూ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ జంపాన శ్రీనివాస గౌడ్ నియామకపత్రం అందజేశారు.

శాకంబరీగా పెరికీడు గంగాంబిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : పెరికీడులోని గంగాంబిక (గంగా నమ్మతల్లి)ని 50కి పైగా వివిధరకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి మంగళవారం పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవస్థాన ఆవరణను, పరివార దేవతలను కూడా కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. ఈ కార్యక్రమం లో అర్చకులు మహేష్, జెట్టి సీతమ్మ, నందూరి శర్మ, నక్కా బాబు, పుట్టి రాంబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : గోవిందనామ ప్రచార సేవాసంఘం, సేవాభారతి ఆధ్వర్యంలో మంగళవారం ఉంగుటూరు గ్రామస్థులు గ్రామదేవత గంగానమ్మకు ఘనంగా ఆషాడ సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఖండ సేవా ప్రముఖ యడవల్లి పాండురంగారావు, మహిళా కమిటీ సభ్యులు, భక్తబృందం, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్‌జంక్షన్ కెడీసీసీ బ్యాంకు ఆవరణలో సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నినాదాలు చేశారు. కార్మిక కోడ్‌ను ఉపసంహరించాలని, అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులపై దాడి చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు, బ్రాంచ్ చీఫ్ మేనేజర్ అవినాష్, సూపర్‌వైజర్ నజీర్, పాల్గొన్నారు.

లక్ష్మీ తిరుపతమ్మ సంబరం 1న

గన్నవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరం లక్ష్మీ తిరుపతమ్మ సంబరం వైభవంగా నిర్వహించాలని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఆలయ కళ్యాణ వేదికలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఆనవాయితీ ప్రకారం ఆగస్టు 1న రెండవ శ్రావణ శుక్రవారం సంబరం జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని, చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణు, జాస్తి శ్రీనివాసరావు, నర్రా గిరిధర్, సీతారాం బాబు, పెసనగంటి మల్లేశ్వరీ, శివలీల పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఏసుబాబు

గన్నవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నియోకవర్గ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా దేవరపల్లి ఏసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ పార్క్ ఆవరణలో మాదిగ ఉద్యోగుల సమస్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనిలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పులపాక ఏసురత్నం, ఉపాధ్యక్షులుగా కె.సతీష్, కాట్రు వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు, రాబర్ట్ జాన్సన్‌ను ఎన్నుకున్నారు.





పెనమలూరులో కోయ ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు .. కేసీపీ కాలనీలో యార్లగడ్డ సుచిత్ర.. ఉయ్యూరు 3వ వార్డులో వైవీబీ ప్రచారం

పేదల సంక్షేమానికి చంద్రబాబు కృషి

పెదఓగిరాల సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెదఓగిరాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రంలో పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెదఓగిరాలలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెనమలూరు నియోజకవర్గంలో రూ. 80కోట్ల మేర నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు పూర్తి చేశామని బోడె ప్రసాద్ అన్నారు. సర్పంచ్ త్రిపురం లక్ష్మి, గ్రామపార్టీ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, నాయకులు పోతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, కొండా ప్రవీణ్, తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నికల హామీలు అమలు చేస్తూ సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు, ఉయ్యూరు నగర పంచాయతీ 3వ వార్డులో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, వార్డు కౌన్సిలర్ తెనాలి పద్మావతి, పార్టీ నాయకులు కూనపరెడ్డి వాసు, అజ్మతుల్లా, సుబ్బారావు, శ్రీనివాస్, వంగవీటి శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రాష్ట్రం, నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని పెనమలూరు మండల టీడీపీ అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావులు వ్యాఖ్యానించారు. మంగళవారం పెనమలూరు పల్లిపేటలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. తోటకూర ఉదయభాస్కర్, గూడవల్లి పూర్ణ, యలమంచిలి ప్రసాద్, కిలారి శ్రీనివాసరావు, బొమ్మిడి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పేర్కొన్నారు. మంగళవారం కేసీపీ కాలనీలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చందు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ జంక్షన్ పట్టణ కమిటీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఇందిరానగర్, హనుమాన్‌నగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వరిగంజి కిషోర్, షరాబు రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



గోదావరి జలాలకు రంగన్నగూడెం వద్ద జలహారతి ఇస్తున్న నాయకులు

చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం పట్టిసీమ

రంగన్నగూడెం వద్ద గోదావరి జలాలకు ఘనంగా జలహారతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి నదులను అనుసంధానం చేసిన విజనరీ నాయకుడు చంద్రబాబుని అందుకు నిదర్శనమే సకాలంలో సాగునీటి విడుదలని ఎన్ఎస్ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం వద్ద పోలవరం కుడికాలువ 130వ కిమీ దగ్గర గోదావరి జలాలకు రైతులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘ అధ్యక్షులతో కలిసి శాస్త్రోక్తంగా పూజ చేసి ఘనంగా జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలవరం కుడికాలువ ఏఈ ఆరెటి హనుమయమ్మ, జలవనరులశాఖ ఏఈ మెర్సీ లక్ష్మీప్రసన్న, రహీమ్, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మల్లవల్లి నీటి సంఘ అధ్యక్షుడు తమ్మిశెట్టి రాంబాబు, ఉప సర్పంచ్ బెజవాడ కృష్ణారావు, తుమ్మల దశరధరామయ్య, రైతులు పాల్గొన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి హెచ్చరించారు. హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నీచమైన భాష మాట్లాడిన కొందరు జైలుకు వెళ్లినా వైసీపీ నాయకుల్లో మార్పురాలేదని ఎద్దేవా చేశారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసు నమోదు చేయాలని సాయికల్యాణి కోరారు.

దొంగతనం అంటగట్టి వేధిస్తున్నారని

ఎస్టీ కమిషన్‌కు మహిళ ఫిర్యాదు

ఉయ్యూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చేయని దొంగతనానికి తనను బాధ్యురాలిని చేసి తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఉయ్యూరుకు చెందిన ఎస్టీ మహిళ మంగళవారం ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం.. ముస్లిం శ్మశాన వాటిక సమీపంలో నివసిస్తున్న వంగర లక్ష్మీ శివాలయం రోడ్డులో నితీశ్ నగల దుకాణం యజమానులు చిట్టూరి జగదీశ్ ఇంటిలో పనిమనిషిగా పనిచేస్తుంది. బెడ్‌రూమ్‌లో హుక్కుకు తగిలించిన ఉన్న చొక్కాలో రూ. 3వేలు పెట్టామని దుప్పటి పరుస్తున్న సమయంలో చొక్కా జేబులో నుంచి వెయ్యి రూపాయలు తియడం కిటికీలో నుంచి చూశామని బెదిరించారు. అంతటితో ఆగక దొంగతనం చేసిన నిన్ను, మీఅబ్బాయిని పోలీసులతో కొట్టించి జైల్లో పెట్టిస్తామని బెదిరించి గదిలో పెట్టి బంధించారని పేర్కొంది. తరువాత తన ఇంటికి వెళ్లి బీరువాలో ఉన్న రూ. 26 వేలు, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్లు తీసుకుపోయినట్టు పేర్కొంది. సంఘటన జరిగి 47 రోజులైనప్పటికి తనకు చెందిన డబ్బు, బాండ్లు ఇవ్వకుండా వాటిపై వేలి ముద్రలు వేయించుకుని బ్యాంకు నుంచి డబ్బు తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొంది.

వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన

ఉంగుటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వరిలో నారుమడి దశనుంచి సమగ్ర యాజమాన్య పద్ధతులు(నీరు. ఎరువులు, సస్యరక్షణ) పాటించడంద్వారా పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చుని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) డీడీఏ కే.జ్యోతిరమణి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మానికొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో గద్దె రమేశ్, డీఆర్సీ ఏడీఏ టి.శ్రీనివాస్, ఏవో బి.పద్మజ, ఎంపీవో జి.రమేష్, ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, సీతారామప్రసాద్, ఆరికట్ల రవికుమార్, యాసం పార్వతీశం, గోగినేని గోపయ్య, గొరిపర్తి సాంబశివరావు, వీరంకి గోవర్ధనరావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం తోపాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించడంతోనే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనాథ్‌బాబు రైతులకు సూచించారు. మల్లవల్లి, రంగన్నగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

పెనమలూరు : మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వణుకూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఓ కే శైలజ రైతులనుద్దేశించి మాట్లాడుతూ వణుకూరు గ్రామంలో 350 ఎకరాల వరకు వరి నాట్లు వేశారని తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్య ఉన్నా ఈనెల 13లోపు రైతుసేవా కేంద్రాల్లో అర్జీలు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు.



రంగన్నగూడెంలో పొలం పిలుస్తోంది

పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్ల నియామకం

కంకిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పలు పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్లను, డైరెక్టర్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. కంకిపాడు చైర్‌పర్సన్‌గా సుంకర శివ రంగారావు, డైరెక్టర్లుగా గోళ్ల జయరామ్, డి. నాగేశ్వరరావు, మంతెన సొసైటీ చైర్మన్‌గా కర్రి శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా రాజులపాటి శ్రీనివాసరావు, కొండపల్లి నాగేశ్వరరావు, ప్రొద్దుటూరు సొసైటీ చైర్మన్‌గా ఈడా వెంకటకృష్ణారావు, డైరెక్టర్లుగా పడమట కుమారస్వామి, ఈడా కృష్ణమూర్తి, తెన్నేరు సొసైటీ చైర్మన్‌గా గద్దె నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా సూరపనేని నాగకృష్ణ, కొండవీటి శ్రీనివాసరావు, ఉప్పలూరు సొసైటీ చైర్మన్‌గా పడవల మధుసూదనరావు, డైరెక్టర్లుగా పరసా సురేష్, వెనగల దుర్గా భవానిలను నియమించింది.

ఉయ్యూరు: చినఓగిరాల సొసైటీ చైర్‌పర్సన్‌గా పాలడుగు రామకృష్ణ, డైరెక్టర్లు గా కఠారి కనకదుర్గారావు, మోగదాటి స్వాన్లి, కాటూరు చైర్‌పర్సన్‌గా గుర్రం చంద్ర శేఖర్, డైరెక్టర్లుగా బెజవాడ ధనకోటి గోపాలరావు, సోదం సాంబశివరావు, పెదఓగిరాల చైర్‌పర్సన్‌గా మున్నంగి శ్రీనివాసరెడ్డి డైరెక్టర్లుగా మారగాని శివకుమారి, ఓదూరి సాంబశివరావు, సాయిపురం చైర్‌పర్సన్‌గా కోట వెంకటేశ్వరశర్మ, డైరెక్టర్లుగా గుండే సతీశ్‌బాబు, చిలకంటి రాంబాబు, వీరవల్లి మొఖాస చైర్‌పర్సన్‌గా యా దంరెడ్డి శివరామకృష్ణ ప్రసాద్, డైరెక్టర్లుగా కోలవెంటి సుధాకర్‌రావు, గోళ్ల గోవర్ధన రావు, ఉయ్యూరు చైర్‌పర్సన్‌గా కూనపరెడ్డి శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా పేరేపి రామకిషోర్, పచ్చిగళ్ల కోటేశ్వరరావు నియమితులయ్యారు.

పెనమలూరు : పెనమలూరు సొసైటీ చైర్‌పర్సన్‌గా కిలారు శ్రీనివాసరావు డైరెక్టర్లుగా నెప్పల్లి హరీష్, ఉప్పులూరి కేశవరావు, పెదపులిపాక చైర్‌పర్సన్‌గా గుంటుపల్లి విశ్వేశ్వరరావు, డైరెక్టర్లుగా ముక్కామల అచ్చయ్య, కొండేటి దుర్గారావు, పోరంకి చైర్‌పర్సన్‌గా మంచినేని పరమేష్, డైరెక్టర్లుగా జరుగు రాజా, పోసిపోయిన రవి నియమితులయ్యారు.

గన్నవరం : బీబీగూడెం చైర్‌పర్సన్‌గా బోయపాటి మురళీకృష్ణ(బుల్లియ్య) డైరెక్టర్లుగా రేవూరి శివరామకృష్ణ, బోగ సుబ్బారావు, బుద్ధవరం చైర్‌పర్సన్‌గా ముద్రబోయిన శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా గుర్రం రవి సత్యనారాయణ, మన్నే శ్రీనివాసరావు, గన్నవరం చైర్ పర్సన్‌గా కాసన్నేని పద్మప్రియ, డైరెక్టర్లుగా పొన్నం మధుసూదనరావు, వీర్ల కిరణ్‌కుమార్, కొండపావులూరు చైర్ పర్సన్‌గా మల్లారెడ్డి కిషోర్, డైరెక్టర్లుగా తోటిమట్టి నాంచారయ్య, కూచిపూడి నీలాంబరం, ముస్తాబాద చైర్ పర్సన్‌గా మేడేపల్లి రమా, డైరెక్టర్లుగా షేక్ కరిముల్లా, పల్లి కార్తిక్, వీరపనే నిగూడెం సొసైటీ చైర్‌పర్సన్‌గా జొన్నలగడ్డ దేవరయ్య, డైరెక్టర్లుగా వజ్రాల రాజశేఖర్‌రెడ్డి, కాట్రు కేశవులను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

విజయవాడ రూరల్ : నున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కలకోటి శ్రీనివాసరెడ్డి, పర్సన్స్‌గా గంపా శ్రీనివాసరావు, పామర్తి శ్రీనివాసరావులను ఎంపిక చేశారు.

కార్మెల్ మాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ప్రారంభం



కానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని మౌంట్ కార్మెల్ మాత దేవాలయ మహోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభించారు. విచారణ గురువులు ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఫాదర్ బొల్లికొండ జయరాజు కార్మెల్ మాత పతకాన్ని ఆవిష్కరించారు. ఈ మహోత్సం సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6నుంచి రాత్రి పది గంటల వరకు నవదిన ప్రార్థనలు, దివ్యబలి పూజలు నిర్వహిస్తారు. 16న కార్మెల్ మాత మహోత్సవ ముగింపు సందర్భంగా సాయంత్రం సమిష్టి దివ్య బలిపూజను ఫాదర్ కెవిన్ అంతోని సమర్పిస్తారని విచారణ గురువు సలివేంద్ర శౌరి మంగళవారం తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం

హనుమాన్‌జంక్షన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని బాపులపాడు జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్ అన్నారు. బాపులపాడు జడ్పీహైస్కూల్‌లో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు కూడా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యులు గంగాభవాని, మొవ్వా రామారావు, అక్కినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థికి మానవత ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తాళ్లమూడి గ్రామానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి మహమ్మద్ ఖాదర్‌వలీకి కాలేజి ఫీజులు నిమిత్తం మానవత సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ రూ.7500లు ఆర్థికసాయం అందించింది. మంగళవారం స్థానిక మానవత కార్యాలయంలో విద్యార్థికి మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా నగదు అందజేశారు. మానవత నిర్వాహకులు చెక్కా సుబ్బారావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, జేవీవీ. సత్యనారాయణ, కొట్నేని రామచంద్ర రావు వీరమాచనేని నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సింగన్నగూడెంలో సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండలపు శ్రీనివాసరావు, పార్వతి దంపతులు విరాళం అందజేశారు. ఉసర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో రూ.50,116 విరాళాన్ని కుమారుడు మండలపు కిషోర్, రూప దంపతుల చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగేశ్వరశర్మ, చైర్మన్ కొట్టే రాజా, పర్వతనేని రాజాబాబు, సమ్మెట సాంబశివరావు, రాకడ రాజు, మరీదు శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మార్పులను నిరంతరం అధ్యయనం చేయాలి

ప్రముఖ పారిశ్రామిక వేత్త దాసరి రామకృష్ణ



కానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా పరిశ్రమల్లో వస్తున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేయాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో దాసరి రామకృష్ణ చెప్పారు. సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థుల పునఃశ్చరణ తరగతుల ప్రారం భోత్సవ కార్యక్రమం మంగళవారం వర్సిటీ ఆవరణలో జరిగింది. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వరరావు, గౌరవ అతిథి ప్రొఫెసర్ అనూరాధ మాట్లాడుతూ, సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ కలిపిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో. వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ డాక్టర్ ఎ. విఠలేశ్వరర్, హెచ్‌వోడీ డాక్టర్ శ్రీరాం, ఫ్యాకల్టీ రఘువీర, డాక్టర్ ప్రమీల పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత



గన్నవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయంలో సమీపంలో మంగళవారం సాయంత్రం సుమారు ఏడేళ్ల వయస్సు ఉన్న బాలుడు ఏడుస్తూ ఉన్నాడు. విజయవాడ వైపు వెళ్లే ట్యాక్సీ డ్రైవర్ చూసి పోలీసులకు సమచారం ఇవ్వగా ఆ బాలుడిని స్టేషన్‌కు తీసుకువెళ్లి వివరాలు అడిగారు. తన పేరు అనిల్‌కుమార్ అని తల్లిదండ్రుల పేర్లు ప్రసన్న, శివ అని, తండ్రి మెకానిక్‌గా చెబుతున్నాడు. వారిది చల్లపల్లి, విజయవాడ అని మాత్రమే చెబుతున్నాడని పూర్తి వివరాలు చెప్పలేకపోతున్నాడని సీఐ బివి శివ ప్రసాద్ తెలిపారు. బాలుడి గురించి ఎవరికైన తెలిస్తే 94406-27041, 94406-27042 నెంబర్‌లకు సంప్రదించాలని కోరారు. బాలుడిని చైల్డ్ వెల్‌ఫేర్ సంస్థకు అప్పగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

25 మందికి జరిమాన

హనుమాన్‌జంక్షన్ : చట్టాన్ని అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై వి.సురేష్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన 25 మందికి రూ7,950లు జరిమాన విధించారు.





వీధి వ్యాపారాలకో ప్రత్యేక ప్రదేశం

● ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు వీఎంసీ యత్నం ● నగరంలో 17 వేల మంది వీధి వ్యాపారుల గుర్తింపు ● ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు



ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: రోడ్డుకిరువైపులా ఇబ్బడిముబ్బడిగా ఉన్న వీధి వ్యాపారాలు ట్రాఫిక్ సమస్యకు దారి తీస్తోంది. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. కేదారేశ్వరపేట, పటమట రైతు బజార్ వద్ద, చుట్టగుంట సెంటర్ నుంచి కబేళా వరకు, వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ నుంచి కేబీఎన్ కాలేజీ వరకు, బీసెంట్ రోడ్డు, గాంధీనగర్‌లోని అలంకార్ సెంటర్ నుంచి ఏలూరు లాకుల వరకు, 5వ నెంబర్ రూట్‌లో ప్రధానంగా ఈ సమస్య ఉంది. ఉద్యోగులు, రోజు వారీ కూలీలు సాయంత్రం ఇంటి చేరుకునే సమయంలో ఒకేసారి వాహనాలు రోడ్డుపైకి వస్తుండటంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న వ్యాపారాలు ప్రజా రవాణాకు పెను సవాల్‌గా మారాయి. కూరగాయలు, ఫ్రూట్స్, టిఫిన్, చైనీస్ ఫుడ్స్, బిర్యానీ తదితర వ్యాపారాల కోసం ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు ట్రాఫిక్ సమస్యను ఉత్పన్నం చేస్తున్నాయని వీఎంసీ భావించింది. దీనికి చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. దీనిలో భాగంగానే ఇటీవలే ఓ సర్వే నిర్వహించి 17 వేల మంది వీధి వ్యాపారులున్నట్లు గుర్తించింది. ఒక్కో వ్యాపారి నుంచి రూ.200 నామమాత్రపు రుసుం వసూలు చేసి గుర్తింపు కార్డు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దీని ఆధారంగా ఏ ప్రాంతంలో వ్యాపారం చేసుకోవాలో సూచిస్తుంది. ఇంకా గుర్తించని వ్యాపారులతో కలుపుకుని మొత్తం 20 వేలకు పైబడి వీధి వ్యాపారులున్నట్టు అంచనా. వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, రిసోర్స్ పర్సన్‌లను మరో సర్వేకు సిద్ధం చేసింది. గతంలో నిర్వహించిన సర్వేలో నమోదు కాని వీధి వ్యాపారుల వివరాలను ఈ బృందాలు సేకరించి పేర్లు నమోదు చేస్తాయి. వీరికి కొత్తగా గుర్తింపు కార్డులను మంజూరు చేస్తామని, ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కమ్మేస్తున్న కేబుల్ వైర్లు

● విద్యుత్ స్తంభాలు, వీధుల్లో అస్తవ్యస్థంగా వైర్లు
● తొలగింపునకు తుది గడువు ప్రకటించిన వీఎంసీ
● మూడు రోజుల్లో తొలగించాలని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: నగరంలోని రహదారులను కేబుల్ వైర్లు అస్తవ్యస్థంగా మార్చేశాయి. రోడ్డు మార్జిన్లలోని విద్యుత్ స్తంభాలను చుట్టేయడంతో పాటు కొన్ని వీధుల్లో వలయంగా దర్శనమిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు, ప్రయాణికులకు కేబుల్ వైర్లు తీవ్ర ఇబ్బందులు తీసుకొస్తున్నాయంటూ ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా చిన్నచిన్న వీధుల్లో ఈ వైర్లు మరింత భయానకంగా కనిపిస్తున్నారు. వన్‌టౌన్‌లోని కాళేశ్వరరావు మార్కెట్ వ్యాపార కూడళ్లలో వలయంగా ఉన్న వైర్లు అక్కడి వారిని భయకంపితులను చేస్తున్నాయి. కొత్తపేట, వాగుసెంటర్, సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరిపేట, గవర్నమెంట్‌ప్రెస్, ఆయోధ్యనగర్, కేదారేశ్వరపేట, సత్యనారాయణపురం, కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాల్లో ఇరుకుగా ఉండే వీధులను మరింత ఇరుకుగా మార్చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇటీవల వీచిన గాలులకు కొన్ని ప్రాంతాల్లో వైర్లు తెగి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా వేలాడాయి. ద్విచక్ర వాహనంపై అటుగా వెళ్లే ప్రయాణికులకు వేలాడుతున్న వైర్లు తగిలి ప్రమాదాలు జరిగాయి.

మూడు రోజుల్లో తొలగించాలి

ప్రమాదకరంగా మారిన కేబుల్ వైర్లపై వీఎంసీ కన్నెర్ర చేసింది. నగరంలో మానవ మనుగడకు తీవ్ర ఆటంకం తీసుకొస్తున్న వైర్లను తొలగించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఇంటర్నెట్, కేబుల్ ఆపరేటర్లకు ఈ ఏడాది మే 5న నోటీసులు జారీ చేసింది. 6న, 17న రెండు పర్యాయాలు ఆపరేటర్లకు చీఫ్ సిటీ ప్లానర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించి, అనధికారికంగా ఏర్పాటు చేసిన వైర్లను తొలగించాలని ఆదేశించింది. అదే నెల 22, 30న పత్రిక ప్రకటనలు జారీ చేసింది. స్పందన రాకపోవడంతో మంగళవారం మరో ప్రకటన విడుదల చేసి, ఆపరేటర్లకు నోటీసులు జారీ చేసింది. వైర్ల తొలగింపునకు మరో మూడు రోజుల గడువును ఈ నోటీసుల ద్వారా ఇచ్చి ఇదే చివరి హెచ్చరిక అని స్పష్టం చేసింది. మూడు రోజుల్లోగా స్వచ్ఛందంగా వైర్లు తొలగించకపోతే ఏపీఎంసీ చట్టం ప్రయోగిస్తామని హెచ్చరిక జారీ చేసింది.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

● పీఆర్ అండ్ ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, కమిషనర్ ఎంవీ కృష్ణతేజ

గన్నవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ అన్నారు. గన్నవరం మండలం వీరపనేని గూడెం గ్రామంలో మంగళవారం రైతు బండి శ్రీనివాసరెడ్డి 3.16 ఎకరాల్లో 221 మామిడి మొక్కలను ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద నాటారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎంవీ కృష్ణతేజతో కలిసి మామిడి మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 80 వేల ఎకరాల్లో కొత్తగా ఉద్యానవన పంటలను పెంచటం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఏటా ఉద్యానవన సాగులో పెంపుదల జరుగుతుందన్నారు. ఒక్కో మొక్కకు రూ.45తో పాటు ట్రాన్స్‌పోర్ట్ కాస్ట్, ఇవ్వటంతో పాటు మూడేళ్ల పాటు మెయింటెనెన్స్ ప్రభుత్వమే భరాయిస్తుందన్నారు. గోతులు తీయడంతో పాటు మొక్కలనూ ఉపాధి కూలీలే నాటుతారన్నారు. నరేగా వచ్చినప్పటి నుంచి 20ఏళ్లుగా ఏటా లక్ష ఎకరాల్లో మొక్కలు నాటడం చేస్తున్నట్టు తెలిపారు. హార్టీకల్చర్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులకు మంచి అవకాశమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఒక్కరోజు 25వేల మొక్కలు నాటినట్టు తెలిపారు. ఉపాధి హామీ పథకం రైతులకు చేయూతనిస్తుందన్నారు. రైతులతో మాట్లాడి వారి సందేహాలను, సమస్యలను తెలుసుకున్నారు. సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, పంచాయతీ రాజ్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీ శివప్రసాద్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో అరుణ, ఎంపీడీవో టి.స్వర్ణలత, తహసీల్దార్ కేవీ శివయ్య, ఏపీవో రాజు, రైతులు పాల్గొన్నారు.



బంధువుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ ఏసుబాబు, ఇన్‌సెట్లో చావా వసంతరావు

రుద్రవరంలో వ్యవసాయ కార్మికుడి హత్య

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం రుద్రవరం గ్రామంలో వ్యవసాయ కార్మికుడు చావా వసంతరావు (45)పై పథకం ప్రకారం దాడి చేసి హత్య చేశారు. చావా వసంతరావుతో అక్రమ సంబంధం పెట్టుకున్న అశ్వనితో ఏర్పడిన వివాదం వల్ల వసంతరావును పథకం ప్రకారం హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన గ్రామంలో సంచలనం రేకెత్తించింది. చావా వసంతరావు బంధువుల ఫిర్యాదుతో రూరల్ ఎస్ఐ నాగరాజు వసంతరావు భౌతికకాయాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి శవపరీక్ష నిమిత్తం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పోస్టుమార్టం ప్రదేశానికి తరలివచ్చి న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఆర్‌పేట సీఐ ఏసుబాబు, రూరల్ ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని సందర్శించారు. వసంతరావు ఇంటి పక్కనున్న ఇంటి ఆవరణలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అందులో వసంతరావుపై దాడి చేసిన ఉదంతం బట్టబయలైంది. నిందితులు యలమనీడు, అశ్వని, సుధీర్, అనిల్, మహేంద్రపై కేసు నమోదు చేశారు. కాగా చావా వసంతరావుకు పుష్పవతి అనే మహిళతో 25 ఏళ్ల క్రితం వివాహం కాగా ఆమె అనారోగ్యంతో చనిపోయింది వీరికి పుట్టిన కుమారుడిని పుష్పవతి తండ్రి పూర్ణచంద్రరావు పెంచి పెద్దవాణ్ని చేశారు. ఒంటరిగా ఉంటున్న వసంతరావు రుద్రవరంలో నివసిస్తున్న అశ్వనితో అక్రమ సంబంధం పెట్టుకున్నారు. ఆమెకు వివాహమైనప్పటికీ వసంతరావుతో కలిసి జీవిస్తోంది. ఈ నేపథ్యంలో వసంతరావు, అశ్వనికి గొడవలు మొదలయ్యాయి. ఏడాది క్రితం వసంతరావుకు, అశ్వని బంధువుల మధ్య వివాదం జరిగింది. మళ్లీ ఏడాది తరువాత ఈ వివాదం తారస్థాయికి చేరింది. టీడీపీ కార్యకర్త అయిన వసంతరావు వ్యవసాయ పనులతో పాటు ఫిట్టర్ పనులు చేసి కొంచెం సంపాదిస్తున్నాడు. వసంతరావు బంధువు చావా రేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఐదుగురిపై కేసు నమోదు



గోపవరపుగూడెంలో ఏడాది పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రాష్ట్రంలో రహదార్లకు రూ.866కోట్లు

● సుపరిపాలనలో తొలి అడుగులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అధ్వానంగా మారిన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.866 కోట్లు ఖర్చు చేసినట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మండలంలోని గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను, ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించాక చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేశారు. స్థానికుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు ఛిద్రమై గుంతలుగా మారడంతో పాటు కొన్ని చోట్ల చేపల చెరువులను తలపించే రీతిలో ఉన్నాయన్నారు. ఇది గమనించిన సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులకు, పూర్తిగా దెబ్బతిన్న వాటిని పునర్నిర్మించేందుకు రూ.866 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.20.76 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు రూ.641 కోట్లు నిధులు తెచ్చినట్టు చెప్పారు. గన్నవరాన్ని రాష్ట్రంలోని నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్, నల్లూరి వెంకటరత్నం, పల్లగాని రాంబాబు, వేమూరి రవి, కనుమూరి భాను ప్రకాష్, మేడేపల్లి రమ, తుల్లిమిల్లి ఝాన్సీ, చిరుమామిళ్ల సూర్యం, గూడవల్లి నరసయ్య, పరుచూరి నరేష్, బీజేపీ నేతలు, చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్, నల్లూరి కోటయ్య, జనసేన చిమట రవివర్మ పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ

గన్నవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. గన్నవరంలో రెండు రోజులపాటు జరిగే సీపీఐ కృష్ణాజిల్లా మహాసభలను పురస్కరించుకుని మంగళవారం గన్నవరం మూడు బొమ్మల సెంటర్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కమ్యూనిస్టుల కంచుకోట అయిన గన్నవరంలో జిల్లా మహాసభలు జరపటం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి రూ.62,000 కోట్లు అప్పులు, పింఛన్, తల్లికి వందనం ఇలా అన్ని ప్రభుత్వ పథకాలకు వందల కోట్లు అప్పులు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో దింపడానికి సిద్ధమయ్యారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, ఇప్పటి మంత్రి లోకేశ్ అప్పట్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టాలని చెప్పారని, అయితే అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పోలవరం ఎత్తు తగ్గిస్తున్నా చంద్రబాబు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గొప్పలు చెప్పుకునే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడడం లేదన్నారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిలుపుదల గురించి నోరు మెదపడం లేదన్నారు. కమ్యూనిస్టుల ముందు పోరాట కర్తవ్యాలుగా నిరుద్యోగ భృతి రూ.3వేలు, రైతు భరోసా రూ.20వేలు వెంటనే ఇవ్వాలని, మహిళలకు ఉచిత బస్సు పెట్టాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలనేవి ఉన్నాయన్నారు. తొలుత రాయనగర్‌లోని కల్యాణ మండపం నుంచి ఎర్రజెండాల చేతబూని జాతీయ రహదారిపై ప్రదర్శన జరిపారు. సీపీఐ రాష్ట్ర నేతలు గడ్డం కోటేశ్వరరావు, కేవీవీ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా నేతలు దోనేపూడి శంకర్, భవానీ, జిల్లా నేతలు పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ జోషి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ



కురుమద్దాలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విద్యార్థి కలపాల జోయల్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

పామర్రు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పది నిముషాల్లో పాఠశాల తరగతి గదుల్లోకి చేరుకోవాల్సిన ఓ విద్యార్థిని మృత్యువు రూపంలో ఓ లారీ కబళించిన ఘటన పామర్రు మండలం కురుమద్దాలి గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళుతున్న పదవ తరగతి విద్యార్థి కలపాల జోయల్ రత్నం (15) రోడ్డుప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. మండల పరిధిలోని బల్లిపర్రు దళితకాలనీకి చెందిన కలపాల అభినాయల్ (20) పామర్రులోని అస్సెస్సీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో టెన్త్ చదువుతున్న బాబాయ్ కుమారుడు జోయల్ రత్నం (15)తోపాటు మరో విద్యార్థి గిరీష్ (13)ను మోటారు సైకిల్‌పై పాఠశాలకు తీసుకువస్తున్నాడు. కురుమద్దాలి రాణి ఆక్వా కంపెనీకి చేరుకుంటున్న తరుణంలో ఓ లారీ రివర్స్‌లో వస్తూ ఢీకొట్టింది. దాంతో బైక్‌పైనున్న విద్యార్థి జోయల్ రత్నం అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో విద్యార్థి గిరీష్‌తోపాటు బైక్ నడుపుతున్న అభినాయల్ తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై రాజేంద్రప్రసాద్ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరు గుడివాడ, మరొకరు ఉయ్యూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జోయల్ మృతిపట్ల బల్లిపర్రు దళిత కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. జోయల్ మృతికి సంతాపంగా అస్సెస్సీ పాఠశాల ప్రిన్సిపాల్ వాల్సా సెలవు ప్రకటించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా మచిలీపట్నం-విజయవాడ ప్రధాన రహదారిపై బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద జరిగిన మరోరోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలైయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

మరో ఇద్దరికి తీవ్రగాయాలు



కలెక్టర్ లక్ష్మీశకు ప్రతిజ్ఞా పత్రాన్ని అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సమరం తదితరులు

ప్రతి ఒక్కరికీ రెడ్‌క్రాస్ స్ఫూర్తిదాయకం

● 278 బంగారు కుటుంబాల్లో వెలుగులు: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేదరికం సమూల నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన పీ-4 విధానంలో భాగమవుతామంటూ రెడ్‌క్రాస్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ 278 బంగారు కుటుంబాల దత్తతకు ముందుకొచ్చిందని, ఈ స్ఫూర్తితో మరిన్ని పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్నారైలు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. రాజరాజేశ్వరీ పేటకు చెందిన 278 కుటుంబాలను దత్తత తీసుకొని వారి ఉన్నతికి మార్గదర్శిగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ పత్రాన్ని జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ జీ సమరం, కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం లేని సమాజ నిర్మాణానికి ఓ అడుగు వేసి ఏకంగా 278 బంగారు కుటుంబాలను దత్తత తీసుకొన్న రెడ్‌క్రాస్‌కు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. ఒక సచివాలయం పరిధిలోని అన్ని బంగారు కుటుంబాలను లేదంటే ఒక మొత్తం మండలాన్ని కూడా దత్తత తీసుకోవచ్చన్నారు. జిల్లాలో 86 వేల బంగారు కుటుంబాలున్నాయని, ఇప్పటికే 400 మందికి పైగా మార్గదర్శులు ముందుకొచ్చారన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి, కార్యదర్శి ఈ చిట్టిబాబు పాల్గొన్నారు.

బాల కార్మికుల అక్రమ రవాణాకు బ్రేక్

బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో 9 మంది గుర్తింపు

రైల్వేస్టేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది కలిసి సోమవారం మధ్యాహ్నం ఏలూరు నుంచి విజయవాడ వైపు వస్తున్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ (ఎస్ఎంవీటీ) బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో 9 మంది మైనర్ల అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించారు. బచ్‌పన్ బచావో ఆందోళన్ బృందంతో కలిసి జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహింరుట 9 మంది బాలలను కనుగొన్నారు. వీరంతా వెస్ట్ బెంగాల్‌కు చెందిన వారుగా గుర్తించారు. కాట్పాడి, బెంగళూరులో వీరిచేత పనిచేయించేందుకు బ్రోకర్లు తరలిస్తున్నారు. నలుగురు అనుమానాస్పద వ్యక్తులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. బాలలను ఎన్టీఆర్ జిల్లా శిశు సంక్షేమ కమిటీ ముందు హాజరు పరచగా తాత్కాలిక వసతి నిమిత్తం నవజీవన్ హోమ్ బాలుర వసతి గృహానికి, ఎస్‌కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్‌కు పంపించారు. రైల్వే పోలీసు ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే ఆలీబేగ్, ఎస్ఐలు బీ లోవరాజు, మాధవరావు, ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఏ జాన్ కెనడీ, ఏలూరు హెడ్ కానిస్టేబుల్ జీ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు జీ రాజేష్ కుమార్, కే సోమేశ్వరరావు, బచ్‌పన్ బచావో ఆందోళన్ ఏపీ శాఖ అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కే శ్రీకాంత్, రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ జీ ప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సినీ నటుడు మంచు మోహన్‌బాబు

కన్నప్పను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు

● సినీ నటుడు మోహన్‌బాబు

లబ్బీపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కన్నప్ప సినిమాను గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ఇదొక డివోషనల్ బ్లాక్ బస్టర్‌గా విజయవంతంగా కొనసాగుతుందని సినీ నటుడు డాక్టర్ ఎం మోహన్‌బాబు అన్నారు. కన్నప్ప చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా క్యాపిటల్ సినిమాస్‌లో మంగళవారం హీరో, నిర్మాత మంచు మోహన్‌బాబు, గజల్ శ్రీనివాస్, నాగ సాధువులు, మాతాజీలు, ప్రేక్షకులతో కలిసి ఆయన కన్నప్ప సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ ఈ సినిమా నిర్మించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని, ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. హీరోలు ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, నటించడం సంతోషంగా ఉందన్నారు. మఠాధిపతులను, మాతాజీలను సత్కరించారు. సినీనటుడు శివబాలాజీ పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

● షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌రోడ్‌లో పలువురిపై దాడి.. ఆసుపత్రుల్లో చేరిక

● శునకాల ఆపరేషన్లకు పురపాలకసంఘం ఏర్పాట్లు

జగ్గయ్యపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం కుక్కకాటుకు గురై పలువురు ఆసుపత్రుల పాలైయ్యారు. షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌రోడ్డులో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేయటంతో నలుగురు మహిళల సహా ఓ బాలిక గాయపడింది. ఈ మూడు రోజుల్లో దాదాపు 15 మందిపై కుక్కలు దాడి చేసి గాయపరచినట్టు ఆ ప్రాంత వాసి ఉపేంద్రరెడ్డి చెప్పారు. పట్టణానికి చెందిన దాసరి గోపయ్య (30), ఎల్ నాగబాబు (22), సంకా సుమన్ (41), పీ హర్షకుమార్, చెరువుబజార్‌కు చెందిన పీ నరసింహారావు, సీహెచ్ శివ, కే అగ్రహారానికి చెందిన ఏ లింగయ్య (36), బూదవాడకు చెందిన బీ హనుమంతురావు (37), షేర్‌మహ్మద్‌పేటకు చెందిన బాలకృష్ణ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నారు. మార్కండేయ వీధికి చెందిన జే సుమిత్‌ను కోతి కరవటంతో ఆయన ఆసుపత్రికి వచ్చారు. కొద్దిరోజులుగా పట్టణంలో కోతుల బెడద కూడా ప్రారంభమైంది. కోర్టు ఉత్తర్వుల పేరుతో పురపాలక సంఘం గానీ, పంచాయతీలు చర్యలు తీసుకోవటం లేదు. వాటి సంతతి పెరగకుండా ఆపరేషన్లకు సుముఖత చూపుతున్నారు. మునిసిపల్ కమిషనర్ తులసీ వెంకట కృష్ణారావు వివరణ కోరగా కుక్కలను పట్టుకుని ఆపరేషన్లకు పంపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళ ఆరోపణలతో ఆత్మహత్యాయత్నం

● సెల్ఫీ వీడియో విడుదల చేసిన బాధితుడు

విజయవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో సెక్యూరిటీగా పనిచేసి విధుల నుంచి తొలగింపబడిన ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనిపై సెల్ఫీ వీడియో విడుదల చేసిన ఘటన మంగళవారం జరిగింది. గండికోట రామకోటయ్య అనే వ్యక్తి 16 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. మహిళా సిబ్బంది వేధింపులు కారణంగా ఆత్మహత్యకు యత్నించినట్లు వీడియోలో పేర్కొన్నాడు. ఏడాది కిందట సెక్యూరిటీగా పనిచేస్తున్నప్పుడు ఓ మహిళతో తాను అసభ్యంగా ప్రవర్తించానని ఫిర్యాదు చేయగా అప్పటి ప్రిన్సిపాల్ ఒక కమిటీ వేశారు. అందులో ఏమీ తేలకపోయినా విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీని వెనుక మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న డ్రైవర్ వీ రాజ్‌కుమార్ ఉన్నాడని వీరిద్దరినీ డీఎంఈ ఆఫీసులో ఉండే ఓ ఉన్నతాధికారి నడిపిస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనకు ముందురోజు రామకోటయ్యను అడిషనల్ డీసీపీ స్థాయి అధికారి విచారించాడు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నాడు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

కొండాలమ్మను దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్

గుడ్లవల్లేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని మంగళవారం ట్రైనీ కలెక్టర్ ఫరీద్ బేగం దర్శించుకొన్నారు. ఫరీద్ బేగం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు స్వాగతం పలికారు. పూజాది కార్యక్రమాల అనంతరం ఆమెను సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు తహసీల్దారు లోకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫరీద్ బేగంకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న కొండలరావు

రొయ్యూరు పీఏసీఎస్ చైర్మన్‌గా లుక్కా



లుక్కా రేణుకారావు

తోట్లవల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రొయ్యూరు పీఏసీఎస్ చైర్మన్‌గా లుక్కా రేణుకారావుని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రేణుకారావు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. గత ఎన్నికల్లో జడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేసి ఓటమి చెందారు. సభ్యులుగా లుక్కా శివ నాగబాబు, మోర్ల వెంకటప్పయ్యలను నియమించారు. ఈ త్రీమెన్ కమిటీలో ముగ్గురు గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు కావటం గమనార్హం. తోట్లవల్లూరులో రొయ్యూరు పీఏసీఎస్‌కు మాత్రమే త్రీమెన్ కమిటీని నియమించారు.

పమిడిముక్కలలో పీఏసీఎస్‌ల చైర్మన్ల నియామకం

పమిడిముక్కల : మండలపరిధిలో పీఏసీఎస్‌లకు చైర్మన్, చైర్‌పర్సన్‌లను ప్రభుత్వం నియమించింది. గురజాడ సంఘానికి కొండేటి సత్యనారాయణ చైర్మన్, మేరుగ శివరామకృష్ణప్రసాద్, కూచిపూడి సావిత్రమ్మ పర్సన్‌లుగా నియమితులయ్యారు. కృష్ణాపురం సంఘానికి రాజులపాటి శ్రీనివాసరావు, మూర్తిరెడ్డి శ్రీనివాసరావు, కొండవీటి సుజాత. చోరగుడి తోట వెంకటేశ్వరరావు, దాసరి కృష్ణారావు, మీర్జా నవా రక్ అలీ నియమితులయ్యారు.

చెత్త సేకరణలో అంతరాయం నేడు

గుడివాడ : దేశవ్యాప్త సమ్మెలో గుడివాడ పురపాలక సంఘంలోని పారిశుధ్య కార్మికులు పాల్గొంటున్నందున బుధవారం ఇంటింటికి చెత్త సేకరణలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షేమం,అభివృద్ధే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడలో..

గుడివాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం పట్టణంలోని 22,32 వార్డుల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. డ్రెయినేజీ సమస్యలపై రైలుపేటలో స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు రాంబాబు, సాంబయ్య, లింగం ప్రసాద్, డా.సత్యనారాయణ, గోకవరపు సునీల్, రెడ్డి షణ్ముఖ్, మధు, అజయ్, మల్లి పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రహదారులు, మౌలిక వసతులు వేల కోట్లు ఖర్చు చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం రాత్రి సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని శేరిగొల్వేపల్లి, గుంటకోడూరు గ్రామాల్లో ఆయన పర్యటించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అన్ని రకాలుగా మేలు చేస్తుందని తెలిపారు. గుడివాడ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటకోడూరు సర్పంచ్ అంగడాల భారతి, శేరిగొల్వేపల్లి ఎంపీటీసీ అంగడాల రామాంజనేయులు, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మురళీ, వీర్రాజు, కృష్ణప్రసాద్, పాల్గొన్నారు.

పమిడిముక్కల : వైసీపీ ఐదేళ్ల పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా అగినపర్రు, మామిళ్లపల్లి, కృష్ణాపురం శివారు గ్రామాల్లో మంగళవారం పర్యటించి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలుచేస్తున్న సూపర్ 6 పథకాలు, రోడ్ల అభివృద్ధి ఇతర అభివృది పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు ఇంటింటికి వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెలియజేయాలని పార్టీ నాయకులకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు జక్కాశ్రీనివాసరావు, నరేశ్, పలువురు కూటమి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..



పమిడిముక్కలలో..

గుడ్లవల్లేరు : సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మండలంలో పలుగ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. గుడ్లవల్లేరు నీలకంఠేశ్వరపురంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వల్లభనేని బాబూరావు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జంగం మోహనరావు, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, జిల్లాపరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ సాయిన పుష్పావతి, క్లస్టర్ ఇంచార్జ్ పోలవరపు వెంకటరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని రంగబాబు, దేవిశెట్టి రామకృష్ణ, కోగంటి రాధాకృష్ణ, యెనిగళ్ల నాగేశ్వరరావు, బొర్రా నాగేశ్వరరావులు పాల్గొన్నారు. కౌతవరం ఫస్ట్ వార్డులో, పెసరమిల్లి గ్రామంలో, వడ్లమన్నాడు, చింతలగుంట, అంగలూరు, కొండిపాలెం, ఉలవలపూడి తదితర గ్రామాల్లో నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలసి కరపత్రాలను పంపిణీ చేశారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఆశా వర్కర్స్ యూనియన్ ఏకగ్రీవం

కూచిపూడి : మొవ్వ మండల ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పీహెచ్‌సీ స్థాయి నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా మెరుగు దేవమణి, కార్యదర్శిగా లంకపల్లి విజయలక్ష్మి, కమిటీ సభ్యులుగా సువార్త రాణి, చావా భూలక్ష్మి, దగాని పద్మకుమారి, దగాని వెంకటేశ్వరమ్మ, రాయవరపు పద్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు.



మంటాడలో అడ్డకోటు కాల్వలో పూడిక తీస్తున్న సిబ్బంది

పూడికతీత పనులు ప్రారంభం

పమిడిముక్కల : మంటాడ 4వ వార్డు, ఫైర్ స్టేషన్ రోడ్డు, ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఎస్సీకాలనీవరకు అడ్డకోటుకాల్వ పూడికతీత పనులను మంగళవారం జనసేన నాయకుడు, మొవ్వ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సనకా కిరణ్ తన సొంత నిధులు రూ. 10 వేలతో చేపట్టారు. కాల్వ పూడుకుపోయి పొలాలకు సాగు నీరందని పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులు గమనించిన కిరణ్ వారి అభ్యర్థన మేర పూడిక తీత పనులు చేపట్టారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ చార్జ్ తాడిశెట్టి నరేశ్, ఎంపీటీసీ కూనపరెడ్డి సుబ్బారావు, రాజు, పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కూచిపూడి: దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన జరిగే కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. సమ్మెను బలపరుస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా మద్దతు ప్రకటించినట్టు తెలిపారు. సమ్మెలో భాగంగా బుధవారం పెదపూడి భీమనది వంతెన వద్ద నుంచి కూచిపూడి సెంటర్ వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏవో శివనాగరాణి



రైతులకు సూచనలిస్తున్న ఏవో శివనాగరాణి

పామర్రు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయారంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పామర్రు మండల వ్యవసాయాధికారిణి వి.శివనాగరాణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉంద్రపూడి,పోలవరంగ్రామాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ ప్రారంభంలో పంటలకు ఆశించే చీడపీడల నివారణకు రైతులకు గ్రామాల్లో వ్యవసాయాశాఖ సిబ్బంది అందించే సూచనలు, సలహాలను పాటించాలన్నారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగుమందులను వినియోగించకుండా సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని కోరారు. ఆరోగ్యకరమైన పంటలను పండించడం కోసం సేంద్రియ సాగుపట్ల దృష్టి సారించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ స్టెల్లీ, పావనీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

గంజాయి నిందితులకు 15రోజుల రిమాండ్

గుడ్లవల్లేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : యువకులను చెడు వ్యసనాలకు బానిసలుగా మార్చడానికి కారకులైన ఇద్దరు యువకులను గుడ్లవల్లేరు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచిన ఉదంతమిది. గుడ్లవల్లేరు పరిసర ప్రాంతాల్లో యువకులే లక్ష్యంగా గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు గంజాయి విక్రయాలు చేస్తున్నారు. ఆసమాచారాన్ని తెలుసుకొని టెక్నికల్ ఎవిడెన్స్‌ను వాడుకొంటూ వారిపై నిఘాఉంచి ఖచ్చితమైన సమాచారంతో గత నెల 28 తేదీన వారిపై దాడిచేసి గంజాయితో సహా ఆరుగురిని పట్టుకొని కోర్టుకు హాజరుపరచగా న్యాయస్థానం వారికి 15 రోజులు రిమాండ్ విధించారు. కాగా ఈ ఆరుగురికి ఎక్కడి నుంచి గంజాయి సరఫరా అవుతుందనే దానిపై జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్‌ల ఆదేశాల మేరకు గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావు పర్యవేక్షణలో గుడ్లవల్లేరు పోలీసుల బృందం వారం రోజులగా శ్రమించి పశ్చిమబెంగాల్‌కు చెందిన సాంతోను ముండా, గతంలో పలు గంజాయి కేసుల్లో ఉన్న కొండా రాజేష్ వారు ఇరువురూ గంజాయిని ఆరుగురికి సరఫరా చేస్తున్నట్టు గుర్తించి మంగళవారం వారిని అరెస్టుచేశారు. అనంతరం కోర్టువారి ముందు హాజరు పరచగా 15రోజులు నిందితులకు రిమాండ్ విధించింది. సాంతోను ముండా,కొండా రాజేష్ లను నెల్లూరు జైలుకు పంపించామని ఎస్సై ఎస్.వి.వి. సత్యనారాయణ తెలిపారు.



పోలీసులు అరెస్టు చేసిన గంజాయి విక్రయదారులు



వైసీపీ బ్యానర్లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

వైసీపీ బ్యానర్ల తొలగింపుపై నేతల అభ్యంతరం

పామర్రు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పామర్రులో మంగళవారం నిర్వహించనున్న నియోజకవర్గ వైసీపీ నేతల సమన్వయ సమావేశాన్ని పురస్కరించుకుని ఆపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వ్యతిరేకత తెలియజేసేవిధంగా స్వాగత బ్యానర్లను గ్రామ పంచాయతీ సిబ్బంది పోలీసుల భద్రత మధ్య తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న ఆపార్టీ నేతలు పేయ్యల రాజు, ఎంపీపీ దాసరి అశోక్, దొంతిరెడ్డి శ్రీరామరెడ్డి, ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకట రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలికి చేరుకుని సీఐ సుభకర్ వద్ద అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామనికి విరుద్ధమని, బ్యానర్లు తొలగింపు భావ్యం కాదన్నారు. దానికి సీఐ పంచాయతీ వారినుంచి అనుమతి తీసుకోవాలని, ఇష్టారాజ్యంగా బ్యానర్లు ఏర్పాటు తగదని వైసీపీ శ్రేణులకు సూచించారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

పామర్రు : రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక విప్లవాత్మకమైన పథకాలను అమలు చేసి వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి దక్కిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, పామర్రు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మొవ్వా మోహనరావు అన్నారు. రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాడిశెట్టి సాంబశివరావుతో కలసి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేసి అందరికి పంచారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మత్తె వడ్డీకాసులు, చాగంటి అంజిరెడ్డి, కాగిత శ్రీనివాసరావ పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మండలంలో వివిధగ్రామాల్లో గల వైఎస్సార్ విగ్రహాలకు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ తదితర వైసీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని మాజీ మంత్రి కొడాలి నాని గృహంలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలు, రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెరుగుమాల కాళీ ఆధ్వర్యంలో పట్టణంలోని బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం చేశారు. నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, నందివాడ ఎంపీపీ ఆదాం, శ్రీను, విక్టర్, మహ్మద్ ఖాసీం(అబూ), మెరుగుమాల కాళీ, పాలేటి చంటి, నీలకాంత్, విలియం జోషి, పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే ధ్యేయం

● ఎంపీడీవో ఇమ్రాన్

గుడ్లవల్లేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని సమాజమే ధ్యేయంగా పీ4 సర్వే నిర్వహిస్తున్నట్టు గుడ్లవల్లేరు ఎంపీడీవో ఎండి ఇమ్రాన్ పేర్కొన్నారు. మంగళవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీ4 మార్గదర్శి బంగారుకుటుంబాలు కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల అధికారులకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్లవల్లేరులో పీ 4, ఏపీ మాస్ సర్వేబృందాలు గుర్తించిన నిరుపేదలైన కుటుంబాలు 2576 ఉన్నాయని వారిని పీ4 ద్వారా బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామలల్లో గుర్తించిన 2576 మందిని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామాల్లో సంపన్నులతో అనుసంధానం చేసే ప్రక్రియ ఈనెలాకరుకల్లా పూర్తి చేసి ఆగష్టు పదిహేనున నిర్వహించనున్న బంగారు కుటుంబాల కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పీ4 ప్రత్యేకాధికారి నరసింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇమ్రాన్

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

● పేర్ని వెంకట్రామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పేర్ని వెంకట్రామయ్య

పామర్రు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన వైసీపీ పోరాటం చేస్తూనే ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు,మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆరేపల్లి కల్యాణమందిరంలో నియోజకవర్గ వైసీపీ శ్రేణుల సమన్వయ సమావేశం మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ఆచరణ సాధ్యంకానీ హామీలు ఇవ్వడం, అందలం ఎక్కడం, ఆ తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నేతలకు ప్రజా కోర్టులో పరాభవం తప్పదన్నారు. వైసీపీ శ్రేణులు ఇప్పటినుంచే కష్టపడి పనిచేస్తూ గత వైభవాన్ని పార్టీకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ ఎమ్మెల్యేలు రమేష్‌బాబు, బందరు నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, చక్రవర్తి, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కూచిపూడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ కె.రామాంజనేయులు విద్యార్థులకు సూచించారు. కూచిపూడి సిద్ధేంద్ర ఓరియంటల్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటుగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, అతిసార వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

బడ్డీ దుకాణాల్లో తనిఖీలు

గుడివాడ రూరల్: పాఠశాలల సమీపంలో గుట్కా, పాన్ పరాగ్ అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చంటిబాబు తెలిపారు. మంగళవారం మోటూరు, చౌటపల్లి పరిధిలోని కిరాణా, బడ్డీ దుకాణాలను ఆయన విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల వద్ద ఎటువంటి మద్యం అమ్మకాలు, పాన్ పగర్‌లు అమ్మవద్దని బడ్డీ దుకాణ యజమానులను హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ చోరీ

గుడివాడ : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దగల అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జూన్ 6వ తేదీన ఏపీ 16డీపీ 3184 నెంబరు గల ద్విచక్రవాహనాన్ని పార్కు చేసి విజయవాడ వెళ్లి మరుసటి రోజు వచ్చి చూడగా బైక్ కనిపించ లేదని గుడివాడ మండలం బిళ్లపాడు రిక్షా కాలనీకి చెందిన గొరిపర్తి గణేష్ టూటౌన్ పోలీసులు ఆశ్రయించాడు. కేసు నమోదు చేస్తున్నట్టు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ పి.బాబురావు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

● ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్



గుడివాడ రూరల్‌లో..

గుడివాడ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుందర వాతావరణం, ఆదాయం కోసం ఫలాలను ఇచ్చే మొక్కలు నాటుతున్నట్లు ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్ తెలిపారు. మంగళవారం చిరుచింతలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత సరోవర్ పథకం కింద చెరువు గట్టు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఇంటి వద్ద, ఖాళీ స్థలాల్లో ఫలాలు ఇచ్చే మొక్కలు నాటి ఆదాయం పొందాలని కోరారు. జామ, సపోట, బొప్పాయి, కొబ్బరి తదితర మొక్కలు ఆవరణలో, బహిరంగ ప్రదేశాల్లో నాటాలని తెలిపారు. ప్రకృతి పరిరక్షణలో భాగంగా ఇంటిలో ఒక మొక్క ఖచ్చితంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, చిరుచింతల సర్పంచ్ తోట వీర రాఘవయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, కార్యదర్శి అనూల, ఏపీవో రామకృష్ణ, టీఏ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో మంగళవారం అతుల్ ఫౌండేషన్, గుజరాత్ వారి సహకారంతో సంజీవని లక్ష మొక్కల పంపిణీ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ శాఖాధికారి బి.అనంతలక్ష్మీ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత నాగబాబు, అతుల్ కంపెనీ ఉద్యోగి కోటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రజిని,పాల్గొన్నారు.




గుడివాడలో..

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550


ఒరిగి విరిగిపడేలా ప్రమాదకరంగా ఉన్న ధ్వజస్తంభ శిఖరం

భక్తులు ప్రదక్షిణలు చేయొద్దు

అవనిగడ్డ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పాత ఎడ్లంకలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ధ్వజస్తంభం పైభాగం ఒరిగి, విరిగేందుకు సిద్ధంగా ఉన్నందున భక్తులు, పాదచారులు ఎవరూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయరాదని, నడవడం చేయరాదని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.


అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 పైలెట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ సురేష్

బందరు హెడ్‌పోస్టాఫీసులో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0 ప్రారంభం

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు రాష్ట్రంలో మొట్టమొదటిగా పైలెట్ ప్రాజెక్టుగా మచిలీపట్నం హెడ్ పోస్టాఫీసులో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0ను ప్రవేశపెట్టినట్టు మచిలీపట్నం పోస్టల్ సూపరింటెండెంట్ సురేష్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0ను మంగళవారం సురేష్ ప్రారంభించి మాట్లాడారు. వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించేందుకు ఆధునిక టెక్నాలజీ దోహదం చేస్తుందన్నారు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా ప్రజలు పోస్టల్ సేవలను పొందవచ్చన్నారు. పార్శిల్స్‌ను మరింత వేగంగా పంపించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. పోస్ట్‌మెన్ ఇంటికి వచ్చి పార్శిల్ తీసుకెళ్లే సదుపాయం కల్పించామన్నారు. త ద్వారా స్పీడ్ డెలివరీ జరుగుతుందన్నారు.


రుస్తుంబాద పాఠశాలలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌పేట సీఐ ఏసుబాబు

బాలికలకు శక్తి టీం రక్షణ

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బాలికల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని ఆర్‌పేట సీఐ ఏసుబాబు తెలిపారు. మచిలీపట్నం రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సులో సీఐ ఏసుబాబు మాట్లాడారు. ఎలాంటి ఆపదలో వున్నా తక్షణ రక్షణ కోసం శక్తి టీం కదలి వస్తుందన్నారు. మహిళలకు రక్షణ కల్పించే పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టం తదితరాలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


చింతగుంటపాలెం రైసుమిల్లులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

చింతగుంటపాలెం రైస్‌మిల్లులో 300 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చింతగుంటపాలెంలోని లక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్ రైసుమిల్లులో ఉమ్మడి కృష్ణా జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఉమర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 300 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 6ఏ కింద కేసు నమోదు చేశారు. మిల్లు నిర్వాహకుడిపై గతంలో 6ఏ కేసు లు నమోదయ్యాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

తులసీరత్నంకు ప్రముఖుల నివాళి

చల్లపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వితరణశీలి, ఆధ్యాత్మికవేత్త నాదెళ్ల తులసీరత్నం భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు మంగళవారం సందర్శించి నివాళులు అర్పించారు. విశ్రాంత జిల్లా రవాణాశాఖ అధికారి నాదెళ్ల శివరామకృష్ణ మాతృమూర్తి తులసీరత్నం పురిటిగడ్డలోని స్వగృహంలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం 80 సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందించిన ఆదర్శనీయురాలు తులసీతర్నం మృతికి ప్రముఖులు సంతాపం తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయరావు, ఎంపీటీసీ సభ్యుడు రాజులపాటి అంకమ్మ, ప్రముఖులు నాదెళ్ల వెంకట నరసయ్య, పరుచూరి సురేష్, దేవభక్తుని గోపాలకృష్ణ, కైతేపల్లి శ్రీనివాసరావు, నాదెళ్ల పిచ్చియ్య, వడ్లమూడి గోపీచంద్, యద్ధనపూడి మధు, తగిరిశ సాంబశివరావు, తలుపుల సుధాకర్, దేవరపల్లి సురేష్‌బాబు, పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్థులు తులసీరత్నం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శివరామకృష్ణను పరామర్శించారు.


రామాయణంలోని ఘట్టాలను వివరిస్తున్న టీటీడీ ధర్మచారిణి జొన్నలగడ్డ మాధవి

హిందుత్వం మతం కాదు..సనాతన ధర్మం

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : హిందుత్వం మతం కాదని సనాతన ధర్మమని ప్రవచనకర్త జొన్నలగడ్డ మాధవి పేర్కొన్నారు. వాడపాలెం గ్రామంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగే ధార్మిక మంగళవారం పారంభమయ్యాయి. మొదటిరోజు తిరుమలతిరుపతి దేవస్థానం ధర్మచారిణి జొన్నలగడ్డ మాధవి రామాయణంలోని వివిధ ఘట్టాలను ప్రవచించారు. సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రతినిధి తురగా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విఘ్నేశ్వర సత్యసాయి సమాజం భజన నిర్వహించారు.

పోతురాజు స్వామి ఆలయంలో అన్నసంతర్పణ

నాగాయలంక, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పోతురాజు స్వామి ఆలయంలో దాతల ఆర్థిక చేయూతతో కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సబ్బినేని బుల్లియ్య జ్ఞాపకార్థం కుమారులు రామ్మోహన్‌రావు, శ్రీనివాసరావు సహకారాలతో మంగళవారం 306వ అన్న ప్రసాదం వితరణ చేశారు. 180 మంది భక్తులు భోజనం చేశారని నిర్వాహకులు తెలిపారు.


కాకర్లమూడిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత


దివ్యాంగురాలితో మాట్లాడుతున్న కాగిత


దక్షిణ చిరువోలులంకలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు

ప్రజల సంక్షేమమే లక్ష్యం

పెడన రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పాలన అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కాకర్లమూడిలో పర్యటించారు. సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. మొక్కలను నాటారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించారు. తాగునీటి సమస్య ఉందని మహిళలు తెలుపగా, సమస్యను పరిష్కరించాలని పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. సర్పంచి పరసా లక్ష్మీకుమారి, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, ఉమ్మడిశెట్టి శ్రీరామమూర్తి, గంధం గోపాలకృష్ణ, దేవేందర్, గుడిశేవ రామారావు, పరసా కామేశ్వరరావు, చెన్నూరు శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

జెట్ స్పీడ్‌తో సూపర్‌సిక్స్ అమలు

కృత్తివెన్ను : సూపర్ సిక్స్ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెట్ స్పీడుతో అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం సుపరిపాలనలతో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, అవసరమైన చర్యలు తీసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

దక్షిణ చిరువోలులంకలో..

అవనిగడ్డ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ చిరువోలులంకలో సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ఇచ్చిన హామీల్లో 80 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కర్రా సుధాకర్, పరుచూరి దుర్గాప్రసాద్, మండలి రామ్మోహనరావు, మేడికొండ విజయ్, గోసాల బాలకోటేశ్వరరావు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, సనకా బసవయ్య, మత్తి నాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణరావు, నడకుదుటి రవి, పీతా వెంకటేశ్వరరావు, సనకా దేవల రాజు తదితరులు పాల్గొన్నారు.

నందమూరు రైతుల సొంత ఖర్చుతో కాల్వ పూడికతీత : ఎమ్మెల్యే అభినందన


నందమూరు రైతులు స్వచ్ఛందంగా పూడిక తీసిన కాల్వను పరిశీలిస్తున్న కాగిత

పెడన రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నందమూరు నుంచి గోకవరం వెళ్లే రామరాజుపాలెం చానల్ పూడిపోవడంతో నందమూరు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత ఖర్చుతో పూడికతీశారు. ఇంజనీరింగ్ కళాశాల వద్ద రోడ్డుకు ఇరువైపుల ఉన్న పంటకాల్వలను రైతులే రూ.80 వేలు వెచ్చించి సొంతంగా తవ్వుకున్నారు. పూడికతీసిన కాల్వను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరిశీలించి రైతులను అభినందించారు. ఖరీఫ్‌లో సాగునీరు సక్రమంగా అందించాలని రైతులు కోరారు.

శ్రీహరిరావు పోరాటాలు స్ఫూర్తిదాయకం


మోదుమూడి శ్రీహరిరావు 26వ వర్ధంతి సభలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు ఉద్యమనేత మోదుమూడి శ్రీహరిరావు పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు. సీపీఐ సీనియర్ నేత మోదుమూడి శ్రీహరిరావు 26వ వర్ధంతి సభ మంగళవారం భాస్కరపురంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఒడుగు కృష్ణచైతన్య అధ్యక్షతన జరిగింది. అక్కినేని వనజ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. శ్రీహరిరావు పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారన్నారు. శ్రీహరిరావు పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలన్నారు. నైతిక విలువలకు శ్రీహరిరావు దర్పణం అన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ సభ్యుడు మోదుమూడి రామారావు, చేనేత కార్మిక సంఘం నాయకుడు కట్టా హేమసుందరరావు, అక్కినేని చంద్రరావు, కోదాటి నారాయణరావు, ఈశ్వరరావు, చినకొండయ్య, ఎస్టీయు నాయకుడు కొమ్ము ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్లు, సభ్యుల నియామకం

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలంలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ప్రభుత్వం మంగళవారం నామినేటెడ్ చైర్‌పర్సన్లు, సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిలకలపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మేకా గంగాధరరావు, సభ్యులుగా కాగిత ఆదిశేషు, ఎస్. సాంబశివరావు, శివగంగ పీఏసీఎస్ అధ్యక్షుడిగా పిప్పళ్ల వెంకట కాంతారావు, సభ్యులుగా ఇ.హేమశ్రీ, వడ్లమూడి సుబ్బారావు నియమితులయ్యారు. గుండుపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా తూమాటి బసవయ్య, సభ్యులుగా తిరుమలశెట్టి ఫరీద్, డొక్కు బసవయ్య, సీతారామపురం పీఏసీఎస్‌కు ఈడే రాంబాబు, సభ్యులుగా జి. రామారావు, కాగిత వీరరాఘవులు, చిన్నాపురం పీఏసీఎస్‌కు పి. నిరంజన్, సభ్యులుగా కంచర్ల వెంకటేశ్వరరావు, కాగిత వెంకటేశ్వరరావు, పెదయాదర పీఏసీఎస్‌కు కంచర్లపల్లి మోహన్, సభ్యులుగా బావిశెట్టి బసవయ్య, ఎస్. వెంకటేశ్వరరావు, భోగిరెడ్డిపలి పీఏసీఎస్‌కు అనిశెట్టి రామకోటేశ్వరరావు,సభ్యులుగా దావు వెంకటప్పయ్య, సిహెచ్. నాగమల్లేశ్వరరావు, వాడపాలెం పీఏసీఎస్‌కుదారపురెడ్డి వీరాంజనేయులు, సభ్యులుగా పొన్నాల నాంచారయ్య, మేడిశెట్టి రజనిలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పెడన మండలంలో..

పెడన రూరల్ : మండలంలోని పలు పీఏసీఎస్‌లకు సంఘాలకు పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. దావోజిపాలెం పీఏసీ ఎస్ చైర్‌పర్సన్‌గా కాగిత నాగేశ్వరరావు, సభ్యులుగా అబ్దుల్ సమీద్, బొల్లా అమలేశ్వరరావు, నందమూరుకు మన్నె శ్రీనివాసరావు, సభ్యులుగా మట్టా సుబ్రహ్మణ్యేశ్వరరావు, పరసా వెంకటేశ్వరరావు, నందిగామకు చైర్‌పర్సనగా యారగాని నాగరాజు, సభ్యులుగా కాగిత వీర వెంకట నాగ దుర్గా ప్రసాద్, బొడ్డు నాగేశ్వరరావును, కవిపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పుట్టి శ్రీనివాసరావు, సభ్యులుగా కటకం సుబ్రహ్మణ్యేశ్వరరావు, కాగిత కృష్ణాంజనేయులు, కొంకేపూడి చైర్‌పర్సన్‌గా కట్టా నాగరాజు, సభ్యులుగా చీర్ల కృష్ణమోహనరావు, పామర్తి గోపినాథ్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


ప్రజలు వెళ్లడానికి వీలులేకుండా రహదారికి దేవస్థానం ఏర్పాటు చేసిన గేటు

హంసలదీవిలో సీసీ రహదారులకు ఇనుప గేట్లు!

కోడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి వేణుగోపాలస్వామి ఆలయం పక్కన గ్రామపంచాయతీ లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన సీసీ రోడ్డుకు వేణుగోపాలస్వామి ఆలయ నిర్వాహకులు గేట్లు ఏర్పాటు చేసి ఎవరూ వెళ్లకుండా తాళాలు వేయటంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకుండా రహదారులకు అన్ని వైపులా గేట్లు ఏర్పాటు చేయటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గేట్లు ఏర్పాటు చేయటం వల్ల ఎవరికి ఉపయోగమని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీవో సుధా ప్రవీణ్‌ను వివరణ కోరగా, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.17.80 లక్షలతో 300 మీటర్ల మేర ఆలయం పక్కన సీసీ రహదారులు నిర్మించామన్నారు. గేట్లు బిగించిన సంగతి మా దృష్టికి రాలేదని, విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపర్చి తగు చర్యలు చేపడతామన్నారు. గేట్లు ఏర్పాటు చేసి చాలా కాలం అయినప్పటికీ గ్రామపంచాయతీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవటం గమనార్హం.

పెడనలో రూ.4కోట్లతో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి

పెడన, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్మశాన వాటిక అభివృద్ధిపై ప్రత్యేక కృషి సారించామని సీనియర్ టీడీపీ నాయకుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. వేణుగోపాలరావు మాట్లాడుతూ, 13 ఎకరాల 57 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న హిందూ శ్మశాన వాటిక ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి మేరకు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ రూ. 2 కోట్లు సమకూర్చుతామని హామీ ఇచ్చారన్నారు. మరో రూ.2 కోట్లు వివిధ సామాజిక వర్గా ల నుంచి విరాళాల రూపంలో సేకరించి మొత్తం రూ.4 కోట్లతో శ్మశాన వాటికను అన్ని సదుపాయాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు శ్మశాన వాటిక కోసం విరాళాలు ప్రకటించారు. కమిటీ సభ్యులు బొడ్డు దీక్ష. కట్టా మూర్తి, బళ్ల ప్రసా ద్, కమ్మగంటి బాబు, వాసా సాంబశివరావు, గుల్లంకి మాధవ, వాసా గంగాధరరావు, ఊటుకూరి ప్రకాశరావు, కొసనం హేమానంద్, పృథ్వి వినోద్, కమతం గంగాధరరావు పాల్గొన్నారు.

బైక్‌లు నడిపే మైనర్లకు రూ.5వేల చొప్పున జరిమానా

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో బైక్‌లు నడుపుతున్న 25 మంది మైనర్లకు మంగళవారం డీఎస్పీ రాజా కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని హితవు పలికారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ఇందుకు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. వాహనాలు నడుపుతున్న మైనర్లు ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున జరిమానా విధించారు. చిలకలపూడి సీ నబి, ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుట్కా, పాన్ అమ్మితే కఠిన చర్యలు

కోడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల సమీపంలో గుట్కా పాన్ వంటి మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.చాణిక్య అన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో ఉన్న పచారీ కొట్లను, బడ్డీకొట్లను తనిఖీ చేశారు. పొగాకు ఉత్పత్తులను, మత్తు పదార్థాలను అమ్మినా చర్యలు తీసుకుంటామని షాపు యజమానులను హెచ్చరించారు.

మొక్కల పంపిణీ 13న

మచిలీపట్నం టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ లక్ష్మణస్వామి అందించిన మొక్కలను సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న పంపిణీ చేయనున్నట్టు ఉస్మాన్ భాషా తెలిపారు. ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ మొక్కల పంపిణీ కార్యక్రమాల ఆహ్వాన పత్రికను మంగళవారం ఆవిష్కరించారు.



వైఎస్సార్‌కు ఘననివాళి

అవనిగడ్డ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రైతు బాంధవుడు డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైసీపీ నేత సింహాద్రి వికాస్ అన్నారు. జయంతిని పురస్కరించుకుని వైసీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆదర్శ రైతులను సత్కరించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ జి. ఉమా, ఎంపీపీ సుమతిదేవి, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, నలుకుర్తి పృధ్వీరాజ్ పాల్గొన్నారు. **ఘంటసాల :** కొడాలి, శ్రీకాకుళం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. వైసీపీ నేతలు తుమ్మల మురళీకృష్ణ, వేమూరి వెంకట్రావు, వేమూరి ప్రవీణ్, కుంపటి నాగేంద్ర బాబు, గూడపాటి వెంకటేశ్వరరావు, రామారి ప్రసాద్ బాబు, దాసరి బసవ కుటుంబరావు, తాతినేని వెంకట కృష్ణారావు, దిరిశం పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు. **చల్లపల్లి :** దళితవాడలో వైఎస్సార్ విగ్రహానికి సింహాద్రి వికాస్ నివాళులర్పించారు. శీరం నాని, ద్వారకానాథ్, గొరిపర్తి సురేష్, మత్తి రాంబాబు, వెనిగళ్ల జగదీష్, భాగ్యారావు, కమాల్, అర్షద్, పాగోలు ఫణి, బొందలపాటి లక్ష్మి, కొమ్ము డేవిడ్, బెల్లపు హరిబాబు, యడ్ల జగదీష్, చంద్ర చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

చల్లపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) :. చల్లపల్లికి చెందిన భృగుమళ్ల గాంధీ తెనాలి ఆశ్రమంలో ఉంటూ సోమవారం గుండెపోటుతో మరణించారు. భౌతికకాయాన్ని స్వగ్రామమైన చల్లపల్లి తీసుకు రాగా వాసవీక్లబ్ ప్రతినిధి కొల్లిపర నరేంద్ర అవగాహన కల్పించటంతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. ఎల్‌వి.ప్రసాద్ ఆసుపత్రి టెక్నీషియన్ సాయి చల్లపల్లి వచ్చి మృతుని నేత్రాల కార్నియాలను సేకరించారు. క్లబ్ కార్యదర్శి గోళ్ల వెంకటరత్నం, కొల్లిపర నరేంద్ర పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పెడన, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎన్. రమాదేవి, పెడన ఏవో జెన్నీతో కలసి మంగళవారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎరువులు, విత్తనాల ధరల పట్టిక తప్పనిసరిగా దుకాణంలో ఉంచాలని, కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం

పెడన రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో పనిచేస్తూ బదిలీ అయిన ఉద్యోగులను ఎంపీడీవో అరుణకుమారి మంగళవారం సత్కరించారు. ఉద్యోగం బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఎక్కడకు బదిలీ అయినా అంకిత భావంతో సేవలందించాలన్నారు. ఏఈ ధర్మయ్య, ఈవో ఆర్డీ నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు సిబ్బందిని సన్మానించారు.